# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 11 | సంచిక: 330 | ఆదివారం | 22-06-2025 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com

యోగాను ప్రపంచ వ్యాప్తం చేసిన
**దార్శనికుడు ప్రధాని మోడీ**



7లో..



2

జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో భారీగా బదిలీలు

- జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో భారీగా బదిలీలు
- ఖాళీగా ఉన్న పోస్టింగ్‌లతో పాటు పలువురు ఏసీపీలు, సెక్షన్ ఆఫీసర్ల బదిలీలు

సీసీటీవీ ఫుటేజీని విడుదల
**చేయలేమన్న ఈసీ..**

- మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సీసీ ఫుటేజీలను బహిర్గతం చేయాలని విపక్షాలు డిమాండ్..
- అలా చేయడం చట్టవిరుద్ధం.. ఓటర్ల గోపత్యకు భంగం కలిగించినట్లు అవుతుంది: ఎన్నికల సంఘం..



7

## కౌశిక్ అరెస్ట్‌పై హరీశ్ స్పందన...

కేటీఆర్‌ను కూడా ఇబ్బంది పెడుతున్నారంటూ మండిపాటు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్
- ఇది కక్ష సాధింపు చర్యేనన్న మాజీ మంత్రి హరీష్‌రావు
- రేవంత్ సర్కార్‌పై హరీష్‌రావు తీవ్ర విమర్శలు



2

## గిరిజన మహిళపై దాడి.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

- బూర్గంపాడులో గిరిజన మహిళపై దాడిని ఖండించిన కేటీఆర్
- ఇది ముఖ్యమంత్రి పాలన తీరుకు నిదర్శనమని విమర్శ
- ఇలాంటి సీఎం ఉంటే రాజ్యాంగం ఎలా అమలవుతుందని ప్రశ్న
- రాహుల్, ప్రియాంక, ఖర్గేలకు కేటీఆర్ సూటి ప్రశ్నలు
- దేశ మహిళలకు ఇదేనా కాంగ్రెస్ ఇచ్చే గౌరవమని నిలదీత



2

కౌశిక్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేశాడు...
## ఆయనను దేశం దాటించే ప్రయత్నం జరిగింది

- కౌశిక్ రెడ్డి అరెస్ట్‌ను ఖండించిన కేటీఆర్, హరీశ్ పై బల్మూరి వెంకట్ ఆగ్రహం
- పైసల కోసమే కౌశిక్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపణ
- బనకచర్ల విషయంలో కేటీఆర్, హరీశ్ లకు బల్మూరి సవాల్




2


## యోగాంధ్ర సూపర్ హిట్..

- విశాఖ యోగా డేలో 3 లక్షల మందికి పైగా యోగా సాధనలో పాల్గొనడంపై హర్షం

6



# కావేరి కోసం బనకచర్ల డ్రామా!



ఎన్‌డీఎస్ఏ నివేదిక ముందే మేడిగడ్డపై కుట్రలు
6నెలల కిందే అవసరం లేదన్న ఎన్‌డబ్ల్యూడీఏ
ఇచ్చంపల్లి దగ్గర బరాజ్ కోసం ఢిల్లీలో మంతనాలు
మేడిగడ్డ రిపేరుపై ముందుకుపోవద్దని నిర్ణయం
బీఆర్ఎస్ పోరు, 'నమస్తే' కథనాలతో వెనుకడుగు
బాబును రంగంలోకి దింపి కావేరీ లింకుకు ప్రాణం
తెలంగాణకు అన్యాయంపై మళ్లీ బీఆర్ఎస్ యుద్ధం
ప్రజల దృష్టి మళ్లించేందుకు తెరపైకి 'అఖిలపక్షం'
ప్రతిపక్ష ఎంపీలు లేకుండానే ఢిల్లీకి సీఎం, ఉత్తమ్
బనకచర్లపై చర్చిద్దామంటూ మోకరిల్లిన ప్రభుత్వం

గారడి చేస్తుండ్రు.. గడిబిడి చేస్తుండ్రు.. తొండికి దిగితుండ్రు.. మొండికి పోతుండ్రు.. బేమాను నాయకులూ.. భేతాళ మాంత్రికులు.. తెలంగాణను ఆగం చేసేందుకు మనోళ్లతో, మన కంట్లోనే పొడిపించేలా జాతీయ పార్టీలు ఆడే రాజకీయక్రీడలు ఎలా ఉంటాయనేది ఉద్యమ నేతగా కేసీఆర్ దశాబ్దమున్నర కిందటే పాట రూపంలో చెప్పారు. ఇప్పుడదే జరుగుతున్నది.

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:** తమిళనాడులోని కావేరీ బేసిన్‌కు గోదావరి జలాలను తన్నుకుపోవాలనే మోదీ ప్రభుత్వం వ్యూహం పన్నగా, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు సహకరిస్తూ తెలంగాణ ప్రజలను దగా చేస్తున్నారు. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపించేకొద్దీ గోదావరిలో తెలంగాణ గడ్డకు అన్యాయం ముసురుకుంటున్నది. ప్రాంతం, రైతుల భవిష్యత్తు వంటివేవీ పట్టించుకోకుండా కేవలం రాజకీయం, ఓట్లు ప్రాతిపదికన గోదావరిజలాలపై ముగ్గురూ సమిష్టిగా, క్రమబద్ధంగా త్రిముఖ వ్యూహంతో నాటకం ఆడుతూ రక్తి కట్టిస్తున్నారు. ఈ క్రమంలో మేడిగడ్డ బరాజ్‌ను కాలగర్భం లో కలిపేయాలన్న వారిఉమ్మడి లక్ష్యం వేగంగా అమలవుతున్నది. బరాజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) విచారణ కొన సాగుతున్న సమయంలోనే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధీనంలోని 'నేషనల్ వాటర్

మిగతా 2వ పేజీలో..

గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ
## భ్రష్టుపట్టింది

- బీఆర్ఎస్ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్న మంత్రి పొంగులేటి
- రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 10,725 రెవెన్యూ సదస్సులు
- మొత్తంగా 8.58 లక్షల దరఖాస్తులు స్వీకరణ
- ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 67 వేల వినతులు



2

# కౌశిక్ అరెస్ట్ పై హరీశ్ స్పందన...

## కేటీఆర్ ను కూడా ఇబ్బంది పెడుతున్నారంటూ మండిపాటు

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్
- ఇది కక్ష సాధింపు చర్యేనన్న మాజీ మంత్రి హరీష్‌రావు
- రేవంత్ సర్కార్‌పై హరీష్‌రావు తీవ్ర విమర్శలు



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
గ్రానైట్ క్వారీ వ్యాపారిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న సుబేదారి పోలీసులు, అనంతరం వరంగల్‌కు తరలించారు. ఈ అరెస్టుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. కౌశిక్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే దొంగ కేసు బనాయించి, ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేశారని ఆయన మండిపడ్డారు.
సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కేడీలు, బేడీల రాజ్యం నడుస్తోందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టుకుందని, నిద్రలో కూడా ఆయన పేరే కలవరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఫార్ములా వన్ రేసును రాష్ట్రానికి తీసుకొచ్చిన కేటీఆర్‌ను కూడా ప్రస్తుత ప్రభుత్వం సతాస్తోందని మండిపడ్డారు. శని, ఆదివారాల్లో అరెస్టులు చేయవద్దని హైకోర్టు పలుమార్లు చెప్పినా, కౌశిక్‌రెడ్డి విషయంలో పోలీసులు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రస్తుత ప్రభుత్వం సీఎం కుర్చీ విలువను కూడా తీస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థ

# భ్రష్టుపట్టింది

- బీఆర్ఎస్ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్న మంత్రి పొంగులేటి
- రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 10,725 రెవెన్యూ సదస్సులు
- మొత్తంగా 8.58 లక్షల దరఖాస్తులు స్వీకరణ
- ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 67 వేల వినతులు
- దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని, దానిని ప్రక్షాళన చేసి పారదర్శకమైన పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో శనివారం ఆయన హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 14న 'భూభారతి' చట్టాన్ని ఆవిష్కరించారని, ఈ చట్టాన్ని దశలవారీగా అమల్లోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మూడు విడతల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు వివరించారు.
మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టగా, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో జూన్ 3 నుంచి 20 వరకు మిగిలిన ప్రాంతాల్లో సదస్సులు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, వీటి ద్వారా ప్రజల నుంచి 8.58 లక్షల దరఖాస్తులు అందాయని మంత్రి వెల్లడించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేల దరఖాస్తులు రాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 61 వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48 వేలు, నల్గొండ జిల్లాలో 42 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు.
రెవెన్యూ సదస్సులకు ఒకరోజు ముందే ఆయా గ్రామాల్లో రైతులకు, ప్రజలకు ఉచితంగా దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వెళ్లి ఎలాంటి రుసుము తీసుకోకుండా దరఖాస్తులు స్వీకరించారని వివరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు కూడా అందజేశామన్నారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తుల్లో 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

## జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్‌లో భారీగా బదిలీలు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
హైదరాబాద్ బల్దియా పరిధిలోని టౌన్ ప్లానింగ్ శాఖలో శుభ్రపరిచే చర్యలకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ శ్రీకారం చుట్టారు. అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలు, కొందరిపై ఏసీబీ వలలో చిక్కిన ఘటనల నేపథ్యంలో శనివారం మొత్తం 27 మంది అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల్లో 13 మంది అసిస్టెంట్ సిటీ ప్లానర్లు (ACP), 14 మంది సెక్షన్ ఆఫీసర్లు ఉన్నారు. కొన్ని చోట్ల ప్రమోషన్లు కూడా ఇచ్చారు. పని తీరును దృష్టిలో పెట్టుకొని తీసుకున్న ఈ నిర్ణయం టౌన్ ప్లానింగ్‌లో పారదర్శకతకు బాటలు వేస్తుందని భావిస్తున్నారు.

**కీలక బదిలీలు ఇలా:**
కృష్ణమూర్తి (మెహదీపట్నం) ఉప్పల్
పావని (కార్వాన్) సికింద్రాబాద్
సుధాకర్ (SO) ACP, చంద్రయాన్ గుట్ట
లాలప్ప (తాండూర్) శేరిలింగంపల్లి జోన్
జీషన్ (SO) ACP, కూకట్‌పల్లి
భానుచందర్ (చంద్రయాన్ గుట్ట) సంతోష్‌నగర్
మంజుల సింగ్ (గోషామహల్) కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వామి (సంతోష్‌నగర్) మెహదీపట్నం

**సెక్షన్ ఆఫీసర్ల మార్పులు:**
రమేష్ (SO) కుత్బుల్లాపూర్ నుండి చందానగర్
అగ్బర్ అహ్మద్ (SO) హయత్‌నగర్ నుండి శేరిలింగంపల్లి
సురేష్ కుమార్ (SO) ఉప్పల్ నుండి జూబ్లీ హిల్స్
మహేందర్ (SO) ఫలక్నుమా నుండి ఘోషా మహల్
తుల్జాసింగ్ గాజులరామారం నుండి ఉప్పల్
BV ప్రకాష్ కార్వాన్ నుండి మెహదీపట్నం
ముకేష్ సింగ్ చార్మినార్ నుండి గాజుల రామారం
ఈ బదిలీలతో పాటు ఖాళీల భర్తీ, పనితీరు ఆధారంగా ప్రమోషన్లను బల్దియా చేపట్టింది. ప్రజావాణిలో అధిక ఫిర్యాదులు టౌన్ ప్లానింగ్ విభాగంపై రావడంతో, ఇకపై ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారమవుతాయన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి. కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులందరికీ వ్యక్తిగతంగా బదిలీ ఉత్తర్వులు అందజేశారు.

# కావేరి కోసం బనకచర్ల డ్రామా!

మొదటిపేజీ తరువాయి
డెవలప్‌మెంట్ ఏజెన్సీ' (ఎన్‌డబ్ల్యూడీఏ) 2024, ఏప్రిల్ 15వ తేదీన వెల్లడించిన ఎజెండాలో మేడిగడ్డ బరాజ్ విఫలమైందని పేర్కొన్నది.
దాని స్థానంలో గోదావరికావేరీ అనుసంధాన ప్రాజెక్టులో భాగం గా ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించే ప్రతిపాదనను పొందుపరిచింది. వీలైతే ఇచ్చంపల్లి బరా జ్ నుంచి తెలంగాణ నీళ్లు తీసుకోవచ్చని సూచించింది. అంటే, కాళేశ్వరం ప్రాజెక్టును కాలగర్భంలో కలపాలని ముందుగానే నిర్ణయించుకున్నట్లు దీని ద్వారా స్పష్టమవుతుంది. ఈ కుట్రను గుర్తించిన బీఆర్ఎస్ గళం విప్పడంతో రాజకీయంగా దెబ్బతింటామని కాంగ్రెస్, బీజేపీ తెలుసుకొన్నాయి. చంద్రబాబును రంగంలోకి దింపి బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెచ్చి కొత్త డ్రామాను కొనసాగిస్తున్నాయి. తాజాగా బనకచర్లను వ్యతిరేకిస్తున్నాం అని హైదరాబాద్‌లో చెప్పిన రేవంత్‌రెడ్డి, ఢిల్లీకి వెళ్లగానే ఇచ్చంపల్లికావేరీ లింకుపై చర్చిద్దామని కేంద్రం ముందు మోకరిల్లడమే కుట్రకు సాక్ష్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆరు దశాబ్దాల పాటు కృష్ణాజలాల్లో తీరంగా నష్టపోయిన తెలంగాణ, ఇప్పుడు గోదావరి జలాల్లోనూ చారిత్రక అన్యాయానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉన్నది. వాస్తవానికి ఈ కుట్ర ఐదేండ్ల కిందటే పురుడు పోసుకోగా, కేసీఆర్ ఉన్నంతవరకు అమలు కానీయలేదని చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దీనిని వ్యతిరేకించాల్సిందిపోయి, కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయాలనే లక్ష్యంతో 'కావేరీ' వ్యూహంలో పావుగా మారుతున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఏడాదిన్నర కాలంలో జరిగిన నాటకీయ పరిణామాలే నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు.

### డ్రామా-1: గోదావరి-కావేరీ అనుసంధానం

తమిళనాడులోని కావేరీ బేసిన్ ఒట్టిపోయింది. గోదావరిజలాలను అక్కడికి తరలించి తమిళ రైతుల్ని ఆకర్షించి ఓట్లు దండుకోవాలనేది బీజేపీ వ్యూహం. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐదేండ్ల కిందటనే ఈ వ్యూహానికి పదును పెట్టినా కేసీఆర్ హయాంలో ముందుకుపోలేకపోయారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలో కీలక బాధ్యతల్లో ఉన్న తెలంగాణ వ్యక్తి ఒకరు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. గోదావరికావేరీ అనుసంధానంపై చర్చించారు. ప్రాజెక్టుపై ముందుకుపోయేందుకు పావులు కదిపారు. దీనిని పసిగట్టిన 'నమస్తే తెలంగాణ' మన నీళ్లను తన్నుకుపోయేందుకు కుట్రలు మొదలయ్యాయని వరుస కథనాలు ప్రచురించింది. బీఆర్ఎస్ సైతం గళం విప్పడంతో ఆ అంశాన్ని పక్కనపెట్టారు.

### డ్రామా-2: మేడిగడ్డను పడావు పెట్టే కుట్ర


మేడిగడ్డసమ్మక్క బరాజ్‌ల మధ్య ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి అక్కడి నుంచి గోదావరిజలాలను కావేరికి తరలించేలా కేంద్రం అలైన్‌మెంట్ రూపొందించింది. ఇది జరగాలంటే సాంకేతికంగా మేడిగడ్డ అడ్డుగా ఉంటుంది. అందుకే దానిని పునరుద్ధరించకుండా ఎన్‌డీఎస్‌ఏ, కమిటీలు, కమిషన్లు అంటూ ఏడాదిన్నరగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఇందుకు ఆధారాలు కూడా ఉన్నాయి. 15.4.2024న కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్‌డబ్ల్యూడీఏ 19వ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి ఎజెండా ఖరారు చేసింది. అందులో గోదావరికావేరీ అనుసంధాన ప్రాజెక్టులో మూడు అంశాలను పేర్కొన్నది. అందులో అత్యంత కీలకమైనది మేడిగడ్డ బరాజ్. ఈ బరాజ్ కుంగిపోయి వైఫల్యం చెందిన నేపథ్యంలో దాని దిగువన ఇచ్చంపల్లి బరాజ్ నిర్మించి కావేరికి గోదావరిజలాలను తరలించాలని, అవసరమైతే తెలంగాణ అక్కడి నుంచి నీళ్లు వాడుకుంటుందనేది దాని సారాంశం. ఆ సమయంలో మేడిగడ్డ బరాజ్‌పై సాంకేతిక అధ్యయనాలు, విచారణలు కొనసాగుతున్నాయి. విచారణ పూర్తి కాకుండానే బరాజ్ వైఫల్యం చెందిందని, ఇచ్చంపల్లి బరాజ్ నిర్మించాలని ఎందుకు నిర్ణయించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### డ్రామా-3:రంగంలోకి చంద్రబాబు

కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ పట్టుబడుతున్నది. తెలంగాణకు అన్యాయం చేస్తూ తమిళనాడుకు గోదావరిజలాలను ఎలా తన్నుకుపోతారంటూ ప్రశ్నిస్తున్నది. రాజకీయంగా కాంగ్రెస్, బీజేపీలను ఇది ఇరకాటంలోకి నెట్టింది. ఈ సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబు వచ్చారు. దీంతో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్లాన్ మార్చింది. తెలంగాణను ఎండబెట్టేందుకు చంద్రబాబు ఎప్పుడైనా సిద్ధమనేది తెలంగాణ సమాజానికి దశాబ్దాల అనుభవమే. అందుకే చంద్రబాబు రంగంలోకి దిగారు. పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరిజలాలను కావేరికి తరలించేలా సహకరిస్తానంటూ కేంద్రానికి హామీ ఇచ్చారు. గోదావరి నీటిని కృష్ణా, పెన్నా బేసిన్లలో వాడుకునేలా బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

### డ్రామా-4: బనకచర్ల పేరుతో కుట్రలు

ఇచ్చంపల్లి దగ్గర బరాజ్ అని ముందు చెప్పిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు బనకచర్లను తెరమీదికి తేవడాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గమనించి అప్రమత్తం కావాలి. కానీ మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ జరగొద్దన్న ఏకైక లక్ష్యంలో భాగంగా రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా మౌనం వహించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బనకచర్ల కుట్రను 'నమస్తే తెలంగాణ' బట్టబయలు చేస్తూ వరుస కథనాలు ప్రచురించింది. ఇదే సమయంలో తెలంగాణకు జరగబోతున్న చారిత్రక అన్యాయంపై బీఆర్ఎస్ కన్నెర్రజేసింది. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మౌనం వీడలేదు. మరోవైపు చంద్రబాబు ఏకంగా ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించి బనకచర్ల కుట్ర నిజమేనని కుండబద్దలు కొట్టారు. ఎన్‌డబ్ల్యూడీఏ కూడా భాగస్వామ్య రాష్ట్రాలతో సమావేశానికి హైదరాబాద్ వేదికను ఖరారు చేసి అధికారికంగా లేఖలు పంపింది.



డ్రామా-5: కేంద్రం హామీ ఇచ్చిందని నాటకాలు
బీఆర్ఎస్ ఒత్తిడితో ఎట్టకేలకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెర మీదకొచ్చి 'మేం అప్రమత్తంగానే ఉన్నాం. అసలు ఏపీ డీపీఆర్ సమర్పించలేదట. కేంద్ర మంత్రి నాకు స్వయంగా లేఖ రాశారు. మమ్మల్ని సంప్రదించనిది ముందుకు పోనని మాటిచ్చారు' అని తీరిగ్గా సెలవిచ్చారు. కానీ కేంద్రంలో బనకచర్ల నిర్మాణానికి పావులు శరవేగంగా ముందుకు కదిలాయి. ఏకంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు అనుమతుల్లో భాగమైన టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్) ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీన వైఖరిని బీఆర్ఎస్ మరింత ఎండగట్టింది. మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బనకచర్ల కుట్రలను, తెలంగాణకు జరిగే అన్యాయాన్ని ప్రజల ముందుంచారు. దీంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లో బదనాం అవుతున్నామని గ్రహించి కొత్త డ్రామా మొదలు పెట్టింది.

### డ్రామా-6: అఖిలపక్ష ఎంపీల సమావేశం

బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అఖిలపక్ష ఎంపీల సమావేశం నిర్వహించింది. సాధారణంగా పార్లమెంట్ సమావేశాల్లో తప్ప ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వాలు అఖిలపక్షం నిర్వహించడం అరుదని నిపుణులు చెప్తున్నారు. పైగా ఎక్కడైనా అఖిలపక్ష సమావేశమంటూ రాష్ట్రంలోని పార్టీలకు సమాచారం ఇచ్చి, పలానా అంశంపై పార్టీ నుంచి హాజరుకావాలని కోరుతారు. కానీ బనకచర్లపై మాత్రం ఎంపీల అఖిలపక్షం నిర్వహించడం వెనుక అసలు కుట్ర దాగి ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బనకచర్ల ద్వారా కావేరికి గోదావరిజలాల తరలింపు ప్రక్రియకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దంటే 'కర్ర విరగొద్దుపాము చావొద్దు' అన్నట్లుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడుతున్నారు. మరోవైపు ఇదే సమయంలో ఏపీ చంద్రబాబు మీడియా ముందుకొచ్చి తాను కాళేశ్వరంపై ఏనాడూ ఫిర్యాదు చేయలేదని రెండు నాల్కల ధోరణి ప్రదర్శించారు. కూర్చుని మాట్లాడుకుందాం... ప్రాజెక్టులు మీరూ కట్టుకోండి! నీళ్లు వాడుకోండి!! అని ఉచిత సలహాలిచ్చారు.

### డ్రామా-7:కేంద్రం ముందు మోకరిల్లడం

అఖిలపక్షం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్ష నేతలతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలిసి బనకచర్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తే బాగుండేది. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ అవకాశాన్ని ఇవ్వలేదు. కేవలం సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి వెళ్లి కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణకు చెప్పకుండా బనకచర్లపై ముందుకుపోమని హామీ ఇచ్చి, ఇప్పుడు తమకు తెలియకుండానే కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ టీవోఆర్‌ను ఎందుకు ఖరారు చేసిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని ప్రశ్నించాలి. కానీ అదేమీ జరగలేదు. పైగా బనకచర్ల అంశాన్ని అటకెక్కించి, ఇచ్చంపల్లి దగ్గర బరాజ్ నిర్మించి కావేరికి నీళ్లు తీసుకుపోయే అంశంపై చర్చిద్దామంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది కేంద్రం ముందు మోకరిల్లడమే అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బనకచర్లను అడ్డుకుంటామని అఖిలపక్ష సమావేశంలో చెప్పిన రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లిన తర్వాత చంద్రబాబుతో కూర్చుని బనకచర్లపై మాట్లాడేందుకు సిద్ధమని మీడియా చిట్‌చాట్‌లో చెప్పడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### తెలంగాణ భవిష్యత్తు ఏమిటి..?

ఇలా ఏడాదిన్నరగా చోటుచేసుకున్న పరిణామాలతో రాష్ట్ర జలహక్కులపై కత్తి వేలాడుతున్నదని సాగునీటి రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే దీనిని అడ్డుకొని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ కార్యాచరణ ఏమిటనేది అంతుబట్టడంలేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరించి ప్రాణహితజలాలను వాడుకుంటారా? దిగువన పోలవరానికి వదిలిపెడతారా? అనే దానిపైనా ప్రభుత్వం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గోదావరిపై ఏడాదిలో ఎన్ని రోజులు, ఎంత ఇన్‌ఫ్లో ఉంటాయనేది శాస్త్రీయంగా తేలలేదు. అయినా మోదీ ప్రభుత్వం కావేరికి గోదావరి జలాలను తన్నుకుపోవడం, సందట్లో సడేమియాలా చంద్రబాబు ఏపీలోని కృష్ణా, పెన్నా బేసిన్‌కు గోదావరి జలాలను తరలించుకుపోవడాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమర్థిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు.

# కౌశిక్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేశాడు...

## ఆయనను దేశం దాటించే ప్రయత్నం జరిగింది

- కౌశిక్ రెడ్డి అరెస్ట్‌ను ఖండించిన కేటీఆర్, హరీశ్ పై బల్మూరి వెంకట్ ఆగ్రహం
- పైసల కోసమే కౌశిక్ రెడ్డి బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపణ
- బనకచర్ల విషయంలో కేటీఆర్, హరీశ్ లకు బల్మూరి సవాల్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌ను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఖండించడంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డి డబ్బుల కోసం దందాలు చేస్తూ పట్టుబడ్డారని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి కేటీఆర్, హరీశ్ మద్దతు పలకడం సిగ్గుచేటని విమర్శించారు.
కౌశిక్‌రెడ్డి ప్రజా సమస్యలపై పోరాడి అరెస్ట్ కాలేదని, క్రషర్ యజమానులను డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేసినందుకే తెలంగాణ పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారని బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. కౌశిక్‌రెడ్డి చరిత్ర మొత్తం బ్లాక్‌మెయిలింగ్, ప్రజలను మోసం చేయడమేనని ఆయన ఆరోపించారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఎంతో మంది నిరుద్యోగుల నుంచి కౌశిక్‌రెడ్డి డబ్బులు వసూలు చేశారని అన్నారు.
ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను విదేశాలకు పంపినట్లే, కౌశిక్‌రెడ్డిని కూడా దేశం దాటించే ప్రయత్నం జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యే ఒక బ్లాక్‌మెయిలర్ అని తెలిసి హుజూరాబాద్ ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారని వ్యాఖ్యానించారు. ఆయన్ను గెలిపించినందుకు వారు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారని చెప్పారు.
కేటీఆర్, హరీశ్ ఇప్పటికైనా దొంగలకు మద్దతు ఇవ్వడం మానుకోవాలని బల్మూరి వెంకట్ హితవు పలికారు. మీరు చేసిన దొంగతనాలు కూడా త్వరలోనే బయటపడతాయని అన్నారు. ఈ కారణగానే బనకచర్ల విషయంలో బావ, బామ్మర్దులు ముందుగానే



మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బనకచర్ల విషయంలో వైసీపీ అధినేత జగన్ తో కేటీఆర్, హరీశ్ లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. మీకు దమ్ము, ధైర్యం ఉంటే బనకచర్ల విషయంపై ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.

# గిరిజన మహిళపై దాడి.. తీవ్రంగా స్పందించిన కేటీఆర్

- బూర్గంపాడులో గిరిజన మహిళపై దాడిని ఖండించిన కేటీఆర్
- ఇది ముఖ్యమంత్రి పాలన తీరుకు నిదర్శనమని విమర్శ
- ఇలాంటి సీఎం ఉంటే రాజ్యాంగం ఎలా అమలవుతుందని ప్రశ్న
- రాహుల్, ప్రియాంక, ఖర్గేలకు కేటీఆర్ సూటి ప్రశ్నలు



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళపై జరిగిన దాడి అత్యంత అమానుషమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ దురదృష్టకర సంఘటన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనా విధానానికి, పరిపాలన తీరుకు అద్దం పడుతోందని ఆయన విమర్శించారు.
ఈ ఘటనపై స్పందించిన కేటీఆర్, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఇటువంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా కొనసాగితే రాష్ట్రంలో రాజ్యాంగం, చట్టబద్ధమైన పాలన ఎలా అమలవుతుంది?" అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళల భద్రత, గిరిజనుల హక్కుల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం పైనా కేటీఆర్ విమర్శలు సంధించారు. "రాహుల్ గాంధీ దేశ ప్రజలకు ఇస్తున్న హామీ ఇదేనా? ప్రియాంక గాంధీ దేశంలోని మహిళలకు ఇలాంటి గౌరవాన్నే కోరుకుంటున్నారా? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రస్తావించే సమానత్వం అంటే ఇదేనా?" అంటూ ఆయన వరుస ప్రశ్నలు వేశారు. బూర్గంపాడు ఘటన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సమగ్ర, సంతులిత , అభివృద్దే నా ధ్యేయం పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు ,భూగర్భ డ్రైనేజి( UGD) పైప్ లైన్ నిర్మాణము పనులకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం 9 కోట్ల 10 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు , భూగర్భ డ్రైనేజి( UGD) పైప్ లైన్ నిర్మాణము పనులకు, మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని అన్నారు. సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రీ రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన , అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని , నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు ట్రాఫిక్ రహిత , సుఖవంతమైన , మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని చెప్పడం జరిగినది. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని , అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని , మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, గచ్చిబౌలి డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.

భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మరియు మా కార్పొరేటర్లు, మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో ఈ రోజు నవోదయ కాలనీ లో శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు, అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ , కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని తెలియచేసారు.

ప్రతి కాలనీ కి స్వచ్ఛమైన మంచినీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఇంకుడు గుంత ను ఏర్పాటు చేసుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరు క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసు-కుంటున్నాం: డీజీపీ జితేందర్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**
ప్రజల కోసం పని చేసే పోలీసు అధికారులను వారు ఎప్పుడూ అభిమానిస్తారని తెలంగాణ డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్లతో డీజీపీ సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో గత కొంతకాలంగా డీజీపీ సమావేశమవుతూ.. వారికి వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. డీజీపీతో పాటు మరి కొందరు అధికారులు వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. దాదాపు 80 శాతం మంది ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ పూర్తి చేశామని డీజీపీ తెలిపారు. సిద్దిపేట, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నారాయణపేట, సూర్యాపేట జిల్లాల్లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లందరికీ ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, బాధితులను రక్షిస్తూ పనిచేయాలని డీజీపీ సూచించారు. వారి పని తీరును క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకుంటున్నామని, దాదాపు పది పోలీస్ స్టేషన్లపై ప్రజలు వందశాతం సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లు ప్రజల ఆదరణ పొందాలని సూచించారు.

# "టైమ్స్ హోమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో 2025"

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
మాదాపూర్ డివిజన్ పరిధిలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నిర్వహించిన "టైమ్స్ హోమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో 2025" కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గంధ్ర సత్యనారాయణ రావు, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..
రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందంటూ కొందరూ కావాలనే పనిగట్టుకొని మా ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి వారు ఒక్కసారి కళ్లు తెరిచి వాస్తవాలు తెలుసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లో "టైమ్స్ హోమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో 2025"ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. "2024 25 ఆర్థిక సంవత్సరంలో రియల్ ఎస్టేట్ & ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో 15.4 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది. నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి చెందింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం రూ.80వేల కోట్లు సమకూర్చింది. తెలంగాణ సర్వీసెస్ ఎకానమీలో ఈ రంగం వాటా 24.9 శాతం. ప్రస్తుతం రెరా దగ్గర 9744 రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్ రిజిస్టర్ అయ్యాయి. ఇవి గణాంకాలు కాదు. మా హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి చెంప దెబ్బ" అని వివరించారు.




"ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్క హైదరాబాద్ లోనే 5900 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.కోటి, అంత కంటే ఎక్కువ ధర గల ఇళ్ల వాటా 18 శాతంగా ఉంది. ఈ తరహా ఇళ్ల కొనుగోలులో వార్షిక వృద్ధి రేటు 58 శాతంగా నమోదు అయ్యిందని నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది" అని గుర్తు చేశారు. "రాష్ట్రంలో అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తాం. తొలి దశలో 4.16 లక్షలు ఇచ్చాం. ప్రతి ఒక్కరూ తలెత్తుకొని గౌరవప్రదంగా జీవించాలనే సంకల్పంతోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టాం"అని చెప్పారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న నిర్మాణ రంగం అభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. "ఈ వేదిక ద్వారా బిల్డర్లు, కొనుగోలుదారులకు ఒక్కటి స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ప్రభుత్వం మీ వెంట ఉంది. నిర్మాణ రంగ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా సిద్ధంగా ఉంది. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు. ధైర్యంగా అడుగు ముందుకు వేయండి"అని కోరారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రెసిడెంట్ జైదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కోడలు పారిపోయిందని అత్తమామలు ఆరోపణ..

# 10 అడుగుల గుంతలో మృతదేహం లభ్యం

- **హర్యానాలోని ఫరీదాబాద్‌లో వెలుగులోకి దారుణమైన ఘటన..**
- **అదనపు కట్నం కోసం వివాహితను హత్య చేసిన భర్త, అత్తమామలు..**
- **10 అడుగుల గుంతలో లభ్యమై మహిళ మృతదేహం.. నలుగురు అరెస్ట్!**

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం:**
హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో దారుణమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలతో కలిసి ఓ మహిళను దారుణంగా చంపేశారు. మురుగు కాల్వ కోసమని గొయ్యి తవ్వి కోడలు శవాన్నీ అందులో పూడ్చి పెట్టేశారు. ఆపై కోడలు ఎవరితోనో లేచిపోయిందని అసత్య ప్రచారం చేసారు. అయితే, రెండేళ్ల క్రితం అరుణ్ తో వివాహం జరగగా.. అదనపు కట్నం కోసం వేధించడంతో ఏడాది పాటు సదరు వివాహిత తనూ పుట్టింట్లోనే ఉండిపోయింది. ఆ తర్వాత కొంత డబ్బు అప్పుజెప్పి అత్తింట్లో దిగబెట్టగా.. అత్తింటి వారు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఇక, మృతురాలి సోదరి పోలీసులకు కంప్లైంట్ చేయడంతో రెండు నెలల తర్వాత ఈ దారుణమై ఘటన వెలుగులోకి వచ్చింది.

అయితే, ఈ ఘటనలో దారుణ హత్యకు గురైన వివాహిత 'తనూ' మృతదేహాన్ని శుక్రవారం నాడు 10 అడుగుల గుంతలో నుంచి పోలీసులు బయటకు తీశారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో హత్య జరిగి సుమారు రెండు నెలలకు పైనే కావొచ్చని పేర్కొన్నారు. ఈ సంఘటనకు సంబంధించి తనూ భర్త, అత్తమామలు, మరో దగ్గరి బంధువుతో సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తనూ అత్తింటి వారితో నివసించిన ఇంటి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో కొత్తగా వేసిన కాంక్రీట్ కింద ఈ మృతదేహాన్ని ఉన్నట్లు కనిపెట్టారు. అయితే, గత రెండు నెలల క్రితం మురుగు నీటి కాలువ నిర్మాణం కోసం ఆ ప్రాంతంలో ఓ గుంతను తవ్వినట్లు స్థానికులు పోలీసులకు వెల్లడించారు.

ఇక, ఫరీదాబాద్‌లోని రోషన్ నగర్ కు చెందిన అరుణ్‌కు, షికోహాబాద్ కు చెందిన తనూకు 2023లో పెళ్లైంది. వివాహం జరిగిన తర్వాత కొద్ది నెలలకే అత్తింట్లో వేధింపులు ప్రారంభమయ్యాయని ఆమె సోదరి ఆరోపించింది. తన సోదరిని అత్తింటి వారు బంగారం, డబ్బు కోసం మానసికంగా, శారీరకంగా హింసించారని తెలిపింది. తమ కుటుంబం శక్తి మేర వారి డిమాండ్లను కొంతమేర తీర్చినా, వేధింపులు ఆగలేదని బోరున విలపించింది. అయితే, ఏప్రిల్ 9వ తేదీన తన సోదరికి ఫోన్ చేసినప్పుడు కలవకపోవడంతో.. అనుమానం వచ్చింది, ఏప్రిల్ 23న అత్తింటివారు తనూ ఇంటి నుంచి ఎవరితోనో పారిపోయిందని తమకు చెప్పారని ప్రీతి వెల్లడించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. చాలా రోజుల పాటు వారు కూడా ఈ కేసును పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది.

# అంతర్జాతీయ వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా (జూన్ 21) :**
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AIకృత్రిమ మేధ) ఆరోగ్య సంరక్షణలో ఒక విప్లవాత్మక మార్పు తెస్తోంది. ఇది రోగ నిర్ధారణ, చికిత్స మరియు రోగుల సంరక్షణలో అనేక విధాలుగా సహాయపడుతుంది. విప్లవాత్మక ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) భాగస్వామ్యం" అనే అంశంపై దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ సమావేశాన్ని ఈరోజు మాదాపూర్ డివిజన్ పరిధిలోని యశోద హాస్పిటల్స్హైటెక్ సిటీ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్యులు, వైద్య పరిశోధకులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు మరియు AI సాంకేతిక నిపుణులు సహా 1000 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐటీ & పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గంధ్ర సత్యనారాయణ రావు, యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు & చైర్మన్ గోరుకంటి రవీందర్ రావు తో కలిసి ప్రారంభించిన గౌరవ PAC చైర్మన్ శ్రీ అరెకపూడి గాంధీ.



ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సాంకేతికతతో కూడిన రోగి సంరక్షణ, భవిష్యత్ ఆరోగ్య వ్యవస్థను నిర్మించుకోవడానికి ఇలాంటి వేదికలు ఎంతో కీలకం అని మంత్రి వ్యాఖ్యానించారు. ఇలాంటి వేదికల వల్ల ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AIకృత్రిమ మేధ) యొక్క ప్రాముఖ్యతపై అవగాహనను పెంచుతుంది మరియు కృత్రిమ మేధ సాంకేతికతలను సమర్థవంతంగా స్వీకరించడంలో ఆరోగ్య సంరక్షణ సంస్థలకు మద్దతిస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య సంరక్షణ ఆవిష్కరణలలో ఎల్లప్పుడూ ముందంజలో ఉండటానికి కట్టుబడి ఉంటుందని, ప్రజారోగ్యం మరియు పౌర సేవల్లో కృత్రిమ మేధస్సు AI యొక్క పరివర్తన పాత్రను ఆయన వివరించారు.

యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, వ్యవస్థాపకులు & చైర్మన్ గోరుకంటి రవీందర్ రావు మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణలో సంక్లిష్టమైన వైద్యఆరోగ్య సంరక్షణ డేటాను విశ్లేషించడానికి మరియు అర్థం చేసుకోవడానికి కృత్రిమ మేధ (AI) ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో, ఇది వ్యాధిని ఖచ్చితంగా నిర్ధారించడానికి, సరైన చికిత్స చేయడానికి మరియు వ్యాధుల నివారణకు వేగవంతమైన మార్గాలను అందించడంలో మానవ నిపుణులతో సమానంగా లేదా అంతకంటే మెరుగ్గా పనిచేయగలదని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AI) అనేది వైద్య వ్యవస్థలో వైద్యులను భర్తీ చేయడానికి రుపొందించబడింది కాదని, వారి సామర్థ్యాలను పెంపొందించడానికి, మరింత మెరుగుపరచడానికి రుపొందించిందని అన్నారు. అయితే, ఆరోగ్య సంరక్షణలో AI ని ఉపయోగించడంలో కొన్ని నైతిక మరియు సామాజిక సమస్యలు కూడా ఉన్నయన్నారు. డేటా గోప్యత, పారదర్శకత మరియు AI వ్యవస్థల ద్వారా వివక్ష వంటి అంశాలపై అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. కృత్రిమ మేధస్సు AI ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నప్పటికీ, దాని అభివృద్ధి మరియు ఉపయోగంపై ఎంతో బాధ్యతాయుతంగా ఉండాలని రవీందర్ రావు తెలిపారు.

యశోద హాస్పిటల్స్హైటెక్ సిటీ, క్లినికల్ డైరెక్టర్ & రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్. చినబాబు సుంకవల్లి మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(AI) ఆరోగ్య సంరక్షణలో ఒక విప్లవాత్మకమైన చారిత్రక మార్పు. క్లినికల్ ప్రాక్టీస్ లో కూడా కృత్రిమ మేధస్సు అద్భుతాల్ని సృష్టిస్తుంది. AI అల్గోరిథంలు రోగి వైద్య నివేదికలు (ఎక్స్‌కిరణాలు, MRIలు) విశ్లేషించడంలో మరియు వ్యాధులను, ముఖ్యంగా క్యాన్సర్ ను ప్రారంభ దశలోనే గుర్తించడంలో మానవ నిపుణులతో సమానంగా లేదా కొన్ని సందర్భాలలో అంతకంటే మెరుగ్గా పనిచేయగలదు అని అన్నారు. ఎన్నో ప్రాణాంతక వ్యాధులను తొలిదశలోనే గుర్తించడంవల్ల వాటికి సరైన సమయంలో అత్యుత్తమ చికిత్స మరియు వ్యాధి నివారణలో కూడా మనం ఎంతో ప్రగతి సాధించవచ్చు. రోగ నిర్ధారణ పరీక్షలలో అయితే ఈ "కృత్రిమ మేధ" విశ్లేషణలతో, అత్యాధునిక చికిత్సా పద్ధతులతో డాక్టర్లు అద్భుతాలు సృష్టించగలరు. తద్వారా, రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ సదస్సులో డయాగ్నస్టిక్ ఇంటెలిజెన్స్ మరియు ప్రిడిక్టివ్ అనలిటిక్స్, AIఎనేబుల్డ్ పర్సనలైజ్డ్ ఆంకాలజీ, AIడ్రివెన్ రోబోటిక్ ప్రెసిషన్ సర్జరీ, ఫార్మా మరియు హాస్పిటల్ ఆపరేషన్లలో ఇన్నోవేషన్, ఎథికల్ AI, పబ్లిక్ హెల్త్ మరియు పాలసీ వంటి అంశాలపై దృష్టి సారించినట్లు డాక్టర్. చినబాబు తెలియజేసారు.



## పిలిస్తే పలికే యువ నాయకుడు "ఒగ్గు కిషోర్": రవీందర్ యాదవ్

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
పిలిస్తే పలికే యువ నాయకుడు ఒగ్గు కిషోర్ అని బిఆర్ఎస్ నేత మాజీ ఎంపిపి వై రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. షాద్ నగర్ దస్తావేజులేఖరుల అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా గెలుపొందిన ఒగ్గు కిషోర్ ను స్థానిక బిఆర్ఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. శనివారం పట్టణంలో జరిగిన ఒక కార్యక్రమంలో నూతన అధ్యక్షులుగా గెలుపొందిన ఒగ్గు కిషోర్ ను మాజీ ఎంపీపీ వై రవీందర్ యాదవ్, షాద్ నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, మాజీ వైస్ చైర్మన్ ఎమ్మెస్ నటరాజన్, మాజీ కౌన్సిలర్లు వెంకటరామి రెడ్డి, ఆలోనిపల్లి శ్రీనివాస్ గౌడ్, గ్రంథాల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీ నరసింహారెడ్డి, మహిళా నాయకురాలు ఉమాదేవి, జూపల్లి శంకర్, నక్క వెంకటేష్ గౌడ్ తదితరులు ఒగ్గు కిషోర్ ను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతూ పట్టణంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని మాజీ వార్డు సభ్యుడిగా తన రాజకీయ ప్రస్తానాన్ని మొదలుపెట్టి నేడు కోఆప్షన్ సభ్యుడిగా కూడా ఎన్నో సేవలు అందించాలని ముఖ్యంగా 16వ వార్డులో ఎంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో తన వంతు పాత్ర ఉందని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. భవిష్యత్తులో మరింత రాజకీయ అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షించారు. దస్తావేజుల అసోసియేషన్ సమస్యలకు సంబంధించి తమ వంతు సహకారం కూడా ఎల్లవేళలా ఉంటుందని వారు పేర్కొన్నారు.



## జగ్గంపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా కుమార్ పాల్

**జర్నలిస్ట్ డైరీ, జగ్గంపేట, (జూన్ 21):**
జగ్గంపేట మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా గోరంట్ల కుమార్ పాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జగ్గంపేట మండలం జె. కొత్తూరు సీయోను ప్రార్థన మందిరం లో ఏర్పాటు చేసిన పాస్టర్ల సమావేశం లో కుమార్ పాల్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కుమార్ పాల్ మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి పదవి అప్పజెప్పిన పాస్టర్లకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కుమార్ పాల్ కి జగ్గంపేట మండల పాస్టర్లు కుమార్ పాల్ కి శుభాకాంక్షలు తెలిపారు.



## రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శ

**జర్నలిస్ట్ డైరీ, కాకినాడ జిల్లా జగ్గంపేట (జూన్ 21):**
టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతిపట్ల ఎమ్మెల్యే , టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. విశాఖపట్నంలోని పల్లా శ్రీనివాసరావు స్వగృహంలో ఆయనను ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ 1989 నుంచి తెలుగుదేశం పార్టీకి ఆయన సేవలందించారని గుర్తు చేశారు. 1994లో జరిగిన ఎన్నికల్లో విశాఖపట్నం2 ఎమ్మెల్యేగా విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారన్నారు. సౌమ్యుడిగా పేరుగాంచిన పల్లా సింహాచలం శాసనసభ్యుడిగా ప్రజలకు అన్ని విధాల అండగా నిలిచారు. అని వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. పల్లా కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్వీఎస్ అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, కన్నబాబు, చదరం చంటిబాబు, బోదిరెడ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



### ఘనంగా యోగా అంతర్జాతీయ

## యోగా దినోత్సవ వేడుకలు

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
తపస్య డబల్ సెట్ డిగ్రీ కాలేజ్ చైతన్యపురి వారి ఆధ్వర్యంలో ఈరోజు ఘనంగా యోగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగింది. ఈ సందర్భంగా ఈ విద్యార్థులు సుమారుగా వందమంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి యోగా ట్రైనర్ గోల్డ్ మెడలిస్ట్ ప్రముఖ తెలంగాణ యోగ సెక్రటరీ తెలంగాణ యోగ హిందూ యోగా సెక్రటరీ ప్రశాంతి గారు పాల్గొనడం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలకు యోగాలో ఆసనాలని వేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ త్రివేణి మేడం మరియు కళాశాల అధ్యాపకులు పాల్గొనడం జరిగింది.



# మోక్ష సాధనకు సంగీతం సోపానం

అక్షరాలకు ఉన్న మహిమ ఏమిటో తెలియచేసినవారు వాగ్గేయకారులు.
వాగ్గేయకారులు అని ఎవరిని అనాలి? ధాతు, మాతు అనగా సంగీతం, సాహిత్యం కలిపి ఇచ్చినవారిని వాగ్గేయకారులు అంటూ ఉంటాము.

ప్రథమ వాగ్గేయకారుడు జయదేవుడు అని చెప్తారు, ఆయన సంస్కృతంలో రచించారు. రెండవ వారు లీలాశుకులు, ఆయన శ్లోకములు రచించారు, శ్లోకాలను గేయములు అనరు కానీ గేయముల వంటి శ్లోకములు రచించారు "శ్రీకృష్ణ కర్ణామృత" కర్త.

తెలుగువారిలో మొదటివారిగా చెప్పవలసిన వారిలో అన్నమాచార్యులవారు. అందుకే ఆయనకు ప్రథమ వాగ్గేయకారుడు అని పేరు. సంగీతము, సాహిత్యమూ కూడా కళలు. మంచి సంగీత, సాహిత్య ప్రతిభ ఉన్నవారు దేనిగురించైనా పాడవచ్చు, ఏ భావమైనా చెప్పవచ్చు కానీ మన వాగ్గేయకారులు సంగీత, సాహిత్యములు భగవన్మయం చేసారు.

ప్రపంచంలో సంగీతం అన్నీ దేశములలోనూ ఉన్నది, దేని గొప్పతనం దానిది. Western సంగీతంలో కూడా చాలా గొప్పవారు ఉన్నారు. ఏ కళ అయినా భగవత్స్వరూపము, ప్రపంచం అంతా భగవంతునిదే, సందేహం లేదు! అయితే ఒక్కొక్క దేశానికీ ఒక్కొక్క స్వభావం ఉంటుంది, ఆ స్వభావంలో నుండే ఆ యా దేశాల విద్యలూ, కళలు కనపడుతూ ఉంటాయి. భారతదేశంలో కళలకి, ప్రతిభకి ఏమీ కొదవ లేదు, అత్యద్భుతమైన సంగీతం, సాహిత్యం, శిల్పం అన్నీ ఉన్నాయి, అయితే చిత్రమేమిటంటే వీటి అన్నింటికి దివ్యత్వం ఉంటుంది. భారతీయ సంగీతంలో దివ్యత్వం ఉంటుంది. Music is divine అంటారు కానీ divine music మాత్రం భారతదేశంలోనే లభిస్తుంది. దివ్యత్వాన్నే ప్రతీ కళలో చూపించారు, పాడితే భగవంతుడి మీద, వ్రాస్తే భగవంతుడి మీద, శిల్పం చెక్కితే భగవంతుడు, ఇలా అవ్వడం వలన ఏమి జరిగింది అనేదానిలో ఒక psychological point తెలుసుకోవాలి. ఇతర కళలు లేవా? అన్నీ దేవుడి మీదనేనా? అంటే మిగిలినవి కూడా చెప్పారు కాని అవన్నిటికి కూడా భగవంతుడినే ఆధారం చేసుకొని ఉన్నాయి.

కళకు ఒక స్వభావం ఉన్నది, కళ ఎంత గొప్పదో అంత ప్రమాదకరమైనది కూడా! "కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అని వేదము చెప్పింది. అంటే సంగీతాలు, కావ్యాలు విడిచిపెట్టాలి అని. దత్తాత్రేయ స్వామివారు "సంగీతాల వలన పతనం అవుతారు కావున సంగీతానికి లోను కాకూడదు" అని బోధిస్తారు, "లేడిని చూసి నేర్చుకున్నాను సంగీతానికి ఆకర్షితం కాకూడదని" అంటారు, ఇది భాగవతంలో కనపడుతుంది. ఎందుకు అలా చెప్పారు? ఒకవైపు మహాయోగులు సంగీతకారులు కనపడుతూ ఉంటె, ఒకవైపు సంగీతం లోకంలో బాగున్నట్లు కనపడుతుంది కానీ, వాడి యొక్క వ్యక్తిత్వాన్ని నెమ్మదిగా దెబ్బతీస్తుంది అని మన గురువైన దత్తాత్రేయులవారు చెప్పారు.

ప్రకృతిలో 24 మంది గురువులలో, లేడిని చూసి సంగీతానికి ఆకర్షితం కాకూడదని నేర్చుకున్నాను అని చెప్పారు, వేటగాళ్లు ఒక్కొక్క జంతువును దాని వీక్ పాయింట్ వాడుకుని పట్టుకుంటారు. అలా లేడి దగ్గర వేణువును మ్రోగిస్తారు, ఆ లేడి సమ్మోహితమై ఉండగా దాన్ని బంధిస్తారు. లోకంలో కూడా మనం పరిశీలిస్తే కొందరు కళాకారులు ఎంత బలహీనమైన జీవితం గడుపుతూ ఉంటారో చూడవచ్చు.

సంగీతం గొప్పగా కనపడుతుంది కానీ, కళలో ఉంటూ దాన్ని ఆస్వాదించే వారి మనస్సుకు ఉద్విఘ్నత (emotional) అనేది ఎక్కువ ఉంటుంది. ప్రతీ మనిషికి emotion, intellect అని రెండు ఉంటూ ఉంటాయి. Emotion intellect ని dominate చేస్తే వ్యక్తిత్వం దెబ్బతింటుంది. కళ అంటేనే భావానికి ప్రాధాన్యత ఉంటూ వినేవారికి, పాడేవారికి కూడా ఒక తాదాత్మ్యత కలిగిస్తుంది. కళలో ఒక ఆకర్షణ ఉంటుంది. కళని ఎలా గొప్పదిగా చేయాలి అని ఆలోచించారు మన మహర్షులు. అలోచించి కళకి దివ్యత్వాన్ని కల్పించారు. దానివలన, అన్నిరకాల భావాలు, భావోద్వేగాలు అన్నీ చెప్పినప్పటికీ కూడా ధర్మ రమణీయత అనేది ఆ కళకు వస్తుంది.

భారతీయ సాహిత్యంలో సంగీతంలో ఉన్న గొప్పతనం ఏమిటి అంటే ధర్మరమణీయత. ధర్మము అనగానే ఒక కట్టుబాటు! ఎన్ని రకాల భావాలు చెప్పినా, భగవంతుడితో కట్టుబడి ఉంటె అది మనని దివ్యత్వానికి తీసుకువెళుతుంది. అందుకే అక్షరాలని, స్వరాలని భగవత్స్వరూపాలుగా భావన చేస్తూ ఒక్క కట్టుబాటుతో కూడిన, పవిత్రమైన, ధర్మబద్ధమైన జీవితం ఉండాలి. కళలలో తెలివితేటలు ఉంటాయి కనుక వాటివలన ప్రమాదాలు ఉంటాయి. అధర్మపరుడు పండితుడైతే అంతకంటే ప్రమాదం లేదు. వాడు పాండిత్యమంతా అధర్మాన్ని కప్పిపుచ్చుకోడానికి వాడుకుంటాడు. అందుకే కళాకారులకు ధర్మజీవనం అనేది ప్రధానమైనది. ధర్మజీవనం చేస్తూ ఉపాసన అనేది తోడవ్వాలి! ఎంత మనం ధర్మజీవనం చేస్తున్నా భగవంతుడి ఆసరా లేకుండా ఉండలేము. ధర్మం చేయాలన్నా భగవంతుడి ఆలంబన, అనుగ్రహం కావాలి. భగవదనుగ్రహాన్ని ఆలంబనగా చేసుకొని సంగీతాన్ని, సాహిత్యాన్ని, ధర్మాన్ని చెప్పడం. వాళ్ళు ధర్మాన్ని పాటిస్తూ ఇతరులకు చెప్పడానికి సంగీత, సాహిత్యాలని మాధ్యమంగా తీసుకున్నారు.

సంగీతసాహిత్యాలు అంటే కేవలం ఒక కళ, వినోదం అని మాత్రం కాకుండా ధర్మప్రభోదం చేయాలి. అలా చేయాలంటే ముందు ఆ చెప్పేవాడికి ధర్మం ఉండాలి. చెప్పేవాడి దగ్గర ఆచరణ లేకపోతె దానికి ప్రభావం ఉండదు.

మన వాగ్గేయకారుల గురించి ఆలోచన చేసినట్లైతే ఇప్పుడు చెప్పిన సంస్కారాలన్నీ వాళ్ళ దగ్గర ఉన్నాయి. నాస్తికుడైనా సరే ఆ సంగీతానికి, ఆ సాహిత్య భావాలకి ఆనందించవలసిందే. మన వాగ్గేయకారుల వద్ద ఉన్న ధర్మమూ, భక్తి ఈ రెండూ కలియడం వలన వారి సంగీతానికి, సాహిత్యానికి ప్రాణం వస్తుంది.

కొన్నాళ్ల క్రితం సాహిత్య సంస్థ వాళ్ళు రాజమహేంద్రవరంలో "మాది కేవలం సాహిత్య సంస్థ, ఆధ్యాత్మికత ఏమీ ఉండదు, మాకు అన్నమాచార్య యొక్క సాహిత్యం మీద ప్రవచనం చేయండి, భక్తి గురించి మాత్రం చెప్పద్దు" అన్నారు. అది ఎలాంటిది అంటే మనిషి కావాలి, కానీ ప్రాణం తీసేసి తీసుకురండి అన్నట్లు ఉంటుంది.

సాహిత్యమైనా, సంగీతమైనా సరే పరమార్థం ఏమిటి అంటే పరమార్థమే! సంగీతం, సాహిత్యం అంటే not for entertainment it is for enlightenment. ప్రపంచ సంగీతాలన్నీ entertainment వైపు వెళ్లిపోతూ ఉంటె భారతీయ సంగీతం మాత్రం enlightenment వైపుకు తీసుకువెళుతుంది. ఇతర దేశాల్లో సంగీతం వినోదవిద్య, భారతదేశంలో సంగీతం యోగవిద్య. యోగానికి సంగీతానికి అనుబంధం ఉన్నది! భారతేదేశంలో ఏదయినా యోగవిద్య! కృష్ణపరమాత్మ పద్దెనిమిది అధ్యాయాలకి పద్దెనిమిది యోగములు అన్నారు.

సంగీతానికి యోగానికి చాలా సంబంధం ఉన్నది. సప్తస్వరాలకి, మనలోని సప్తచక్రాలకి సంబంధం ఉన్నది. స, రి, గ, మ, ప, ద, ని అనే సప్తస్వరాలకు, మూలాధారం నుండి సహస్రారం వరకూ ఉన్న సప్తచక్రాలకు అనుబంధం ఉన్నది. దీన్ని బట్టి సంగీతాన్ని సరిగ్గా సాధన చేస్తే మనకి తెలియకుండానే లోపల ఆ చక్ర స్పందన జరుగుతుంది. అయితే ఆ సాధనకి ఒక పవిత్రత ఉండాలి, ఒక ఉపాసనా బలం ఉండాలి. అది ఉంటేనే ఆ సంగీతం నిలబడుతుంది. మన వాగ్గేయకారులు గమనించితే ప్రతీ వాగ్గేయకారుడు ఒక ఉపాసకుడు, ఒక ధార్మికుడు, ఒక ఆదర్శజీవనం గడిపినవాడు. Simple living and high thinking అనే యోగజీవనానికి ఒక తార్కాణంగా నిలబడిన వారు. అది వారి వైభవం. అలా కానీ చేస్తే సంగీతం మోక్షమార్గం కాగలదు, ఇహమూ పరము కూడా ఇస్తుంది సంగీతం.

**బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ**
**ప్రఖ్యాత ప్రవచకులు**
**ట్విట్టర్ ఖాతా నుంచి**

# యుద్ధాల గాయాలు ఆర్థిక, మానవ, పర్యావరణ నష్టాల విశ్లేషణ

ప్రపంచవ్యాప్తంగా ఇరాన్ఇజ్రాయెల్, రష్యాఉక్రెయిన్, భారత్పాకిస్తాన్ మధ్య సంఘర్షణలు మానవాళికి తీవ్రమైన గాయాలను మిగిల్చాయి. ఈ యుద్ధాలు ఆర్థిక నష్టాలు, మానవ బాధలు, పర్యావరణ విధ్వంసం, ఆయుధ క్షీణతలను కలిగించడమే కాక, సమాజంలో బాలలు, వృద్ధులు, స్త్రీలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపాయి. ఈ వ్యాసం ఈ యుద్ధాల వల్ల కలిగిన నష్టాలను విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ, యువతకు ఈ అనర్థాల గురించి స్పష్టమైన అవగాహన కల్పిస్తుంది.



**ఇరాన్-ఇజ్రాయెల్ సంఘర్షణ:**
ఇరాన్ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం రాజకీయ, సైనిక ఉద్రిక్తతలకు కేంద్రబిందువైంది. 2025 జూన్లో ఇజ్రాయెల్ మొస్సాద్ ఆధ్వర్యంలో జరిగిన "ఆపరేషన్ రైజింగ్ లయన్" దాడులు ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేశాయి, దీనివల్ల ఇరాన్ రక్షణ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లింది. ఈ దాడుల్లో డ్రోన్లు, మిస్సైళ్లు వినియోగించబడ్డాయి, ఇవి ఇరాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. గణాంకాల ప్రకారం, 72 గంటల్లో ఇరాన్లో 400 మంది, ఇజ్రాయెల్లో 19 మంది మరణించగా, 1300 మంది ఇరాన్లో, 450 మంది ఇజ్రాయెల్లో గాయపడ్డారు. ఈ దాడులు ఇరాన్లో ఆహార, నీటి కొరతను తీవ్రతరం చేశాయి, ముఖ్యంగా అరక్, తబ్రిజ్ వంటి నగరాల్లో నివాస, వైద్య సౌకర్యాలు కుప్పకూలాయి.

పర్యావరణ నష్టం కూడా తీవ్రంగా ఉంది. అణు కేంద్రాల ధ్వంసం వల్ల రేడియోధార్మిక కాలుష్యం వ్యాపించే ప్రమాదం ఉంది, ఇది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. బాలలు, వృద్ధులపై ఈ దాడుల ప్రభావం ఘోరంగా ఉంది, ఎందుకంటే ఆసుపత్రులు, ఆశ్రయ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇజ్రాయెల్ డ్రోన్ల నుంచి చిన్నపిల్లల ఏడుపు శబ్దాలను వినిపించి పాలస్తీనీయులను ఆకర్షించి దాడులు చేసిన ఆరోపణలు ఈ యుద్ధంలోని నీతివిరుద్ధతను తెలియజేస్తాయి.

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధం:**
2022 నుంచి కొనసాగుతున్న రష్యాఉక్రెయిన్ యుద్ధం మానవాళికి ఒక శాపంగా మారింది. ఈ యుద్ధంలో 500,000 మంది గాయపడ్డారని, 50,000 మంది మరణించినట్లు అంచనా. ఉక్రెయిన్లో ఆర్థిక నష్టం $400 బిలియన్లకు పైగా ఉంది, ఇందులో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక సౌకర్యాలు ధ్వంసమయ్యాయి. రష్యా ట్యాంకులు, బాంబర్ విమానాలు, క్షిపణులు (S300, ఇస్కాండర్) విస్తృతంగా వినియోగించింది, ఇవి ఉక్రెయిన్ నగరాలను శిథిలాలుగా మార్చాయి.

పర్యావరణ నష్టం కూడా భయానకం. రష్యా దాడుల వల్ల నీటి వనరులు, అడవులు, వ్యవసాయ భూములు కలుషితమయ్యాయి. ఉక్రెయిన్లో 15 మిలియన్ల మంది ప్రజలు ఆహారం, నీరు, ఆశ్రయం కోసం ఇబ్బందులు పడుతున్నారు. బాలలు, వృద్ధులపై దాడులు, లైంగిక వేధింపులు, బలవంతపు వలసలు మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీశాయి. రష్యా సైనికులు బుచా, మారియుపోల్లో చేసిన దాడులు యుద్ధ నేరాలుగా పరిగణించబడ్డాయి.


**భారత్-పాకిస్తాన్ సంఘర్షణ:**
భారత్పాకిస్తాన్ మధ్య సంఘర్షణలు, ముఖ్యంగా కాశ్మీర్లో, దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. 1947 నుంచి నాలుగు ప్రధాన యుద్ధాలు, అనేక చిన్న సంఘర్షణలతో ఈ రెండు దేశాలు 70,000 మంది ప్రాణాలను కోల్పోయాయి. 2019 బాలాకోట్ దాడిలో భారత్ ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసిన ఎస్.పీ.ఐ.సీ.ఈ.2000 బాంబులను ఉపయోగించింది. ఈ దాడులు రెండు దేశాల సైనిక సామర్థ్యాన్ని బలహీనపరిచాయి, ఆర్థికంగా రూ.4771 కోట్ల నష్టం వాటిల్లింది.

పర్యావరణంపై ప్రభావం కూడా గణనీయం. కాశ్మీర్లో యుద్ధాల వల్ల అడవులు, నీటి వనరులు దెబ్బతిన్నాయి. స్థానిక ప్రజలు ఆహారం, ఆశ్రయం, విద్యా సౌకర్యాలు కోల్పోయారు. బాలలు, వృద్ధులు మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. సైనికులు చేసిన హింసాత్మక చర్యలు, మానవ హక్కుల ఉల్లంఘనలు ఈ సంఘర్షణలను మరింత జటిలం చేశాయి.

చివరిగా... ఈ యుద్ధాలు కేవలం రాజకీయ లేదా సైనిక పరమైనవి కాదు; ఇవి మానవత్వానికి వ్యతిరేకమైన చర్యలు. ఇరాన్ఇజ్రాయెల్ యుద్ధంలో అణు స్థావరాలపై దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని విమర్శలు వచ్చాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధంలో అమాయక పౌరులు, ఆసుపత్రులపై దాడులు యుద్ధ నీతిని ప్రశ్నార్థకం చేశాయి. భారత్పాకిస్తాన్ సంఘర్షణలో రెండు దేశాలు సైనిక వ్యయంపై దృష్టి పెడుతూ, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్యం వంటి అంశాలను విస్మరిస్తున్నాయి.

యువతకు ఈ యుద్ధాలు ఒక హెచ్చరిక. ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణపరంగా ఈ సంఘర్షణలు దీర్ఘకాలిక నష్టాలను మిగిల్చాయి. యుద్ధాలు శాంతిని కాదు, విధ్వంసాన్ని మాత్రమే తెస్తాయని యువత గ్రహించాలి. శాంతి సంపాదన, సహకారం, సమస్యలను సామరస్యంగా పరిష్కారించు కోవటమే ఉత్తమ మార్గం. ఇరుగు పొరుగు దేశాలు ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా సహకారం, సమన్వయం, ప్రేమ, పరస్పర గౌరవం, పెరుగుతాయి. శాంతియుత సహజీవనంతో ఈ యుద్ధ నష్టాలను నివారించగలవు.

***డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**



# విద్య, భవిష్యత్తుకు, ఆర్థికంగా అండగా ఆకారపు రాజు, గౌతమి, పాఠశాల

**జర్నలిస్ట్ డైరీ, వికారాబాద్ (జూన్ 21):**
ఆర్థికంగా బలహీనంగా ఉన్న, ఓ పేద విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన దంపతులు ఆకారపు రాజు, గౌతమి. నేటి సమాజంలో ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న క్రమంలో, పేద విద్యార్థులకు మేము కూడా అండగా ఉంటామని సహాయం అందిస్తున్న పరిగి ప్రైవేట్ పిజె ఒకేషనల్ జూనియర్ కాలేజ్ యాజమాన్యం, ప్రిన్సిపల్, రెహమాన్ మున్నీసా.




వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ పరిధిలోని. చదువుకోవాలని తపన ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ పేద విద్యార్థినికి తమ వంతు సహకారంగా ఆ విద్యార్థి విద్యకు ఆర్థికంగా పూర్తిగా సహకరించేందుకు పరిగి టీచర్స్ కాలనీలో ప్రైవేట్ ,పీజే ఒకేషనల్ జూనియర్ కాలేజ్ లో ఆ అమ్మాయిని చేర్పించి పూర్తి ఖర్చులు భరించేందుకు ముందుకొచ్చిన, ఆకారపు రాజు గౌతమి, దంపతులు, వారు అందించే ఆర్థిక సాయంతో ఆ విద్యార్థికి ఒక గొప్ప విద్య అవకాశాన్ని అందించడం చాలా గొప్ప విషయం , ఆ అమ్మాయిని కాలేజీలో చేర్పించడంతోపాటు కాలేజీ పూర్తయ్యేంత వరకు అమ్మాయికి కావలసిన పాఠ్యపుస్తకాలు, నోట్, డ్రస్సులు ఇతర ఖర్చులు సైతం తమే భరిస్తామని ముందుకు రావడం చాలా గర్వించదగ్గ విషయం. ఈ సందర్భంగా ఆ దంపతులు మాట్లాడుతూ.. విద్య అనేది విద్యార్థి జీవితానికే కాకుండా . సమ సమాజ నిర్మాణానికి ఎంతో తోడ్పడుతుందని ,చదువులో ప్రతిభ ఉండి , ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు కష్టపడుతున్నారన్న విషయం మా దృష్టికి రావడంతో . కచ్చితంగా ఆ నిరుపేద విద్యార్థికి పూర్తి సహాయం చేయాలని, మా సొంత ఖర్చుతో. విద్యార్థికి . విద్య అందించడం కోసం ఎంత ఖర్చైనా భరిస్తామని, నిరుపేద విద్యార్థులు ఇంకా ఎవరైనా ఉన్నా సరే వారికి ఉన్నత విద్య కోసం , నిరుపేద విద్యార్థు భవిష్యత్తు కోసం, మేము ఎంత ఖర్చయిన పెడతామని అలాంటి వారి ఎవరైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు

ఈ సందర్భంగా కాలేజ్ యాజమాన్యం ప్రిన్సిపల్, రహిమాన్ మున్నీసా మాట్లాడుతూ ..
ఇదివరకి మా కాలేజీ లో ఎంతోమంది నిరుపేదలకు సమాజ సేవ చేస్తూ గత పది సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం పదిమందికి పైగే గ్రీన్ వే సొసైటీ ద్వారా ఉచిత విద్య అందిస్తున్నామన్నారు. నిరుపేద విద్యార్థులకు 50% ఫీజు రాయాధితో విద్యానిధిస్తున్నామని మా కాలేజీలో విద్యా పూర్తి చేసిన విద్యార్థులకు 60% విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ లభిస్తుందని అపోలో, స్టార్, బ్రాంచ్లలో ఎక్కువ శాతం మా కాలేజీలో విద్యా పూర్తి చేసిన విద్యార్థులే ఉన్నారని యజమాన్యం తెలిపింది . ప్రత్యేకించి ఈ విద్యార్థికి మా వంతు సహాయం అందిస్తామని కాలేజ్ ప్రిన్సిపల్ తెలిపారు
విద్యార్థి తల్లిదండ్రులు: ఆకారపు రాజు దంపతులకు ధన్యవాదాలు తెలిపారు తమ ఆర్థిక పరిస్థితుల వల్ల తమ కూతుర్ని చదివించలేకపోతున్నామని గుర్తించి దేవుడిలా వచ్చి మాకు సహాయం చేసి మా కూతురిని చదివిస్తున్నందుకు ఆకారపు రాజు, గౌతమి,దంపతులకు ధన్యవాదాలు తెలియజేశారు.



## ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రపంచ యోగా దినోత్సవం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
ఈరోజు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా షాద్ నగర్ డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ ఆఫీసులో డాక్టర్ బి విజయలక్ష్మి గారి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ బి విజయలక్ష్మి గారు హెల్త్ స్టాఫ్ తో యోగా ఆసనాలు చేయించి, ప్రతి వ్యక్తి ప్రతి రోజు యోగా చేయడం వల్ల మానసికంగా శారీరకంగా ఆరోగ్యపరంగా దృఢపడుతారు అని తెలియజేశారు. ప్రతిరోజు ప్రతి మనిషి నడక నడవడం వలన, ధ్యానం చేయడం, ప్రాణాయం చేయడం, అలోమా ..విలోమా చేయడం వలన, మనిషి యొక్క ఆరోగ్యం మెరుగు పడడమే కాకుండా , జీవితం యొక్క లైఫ్ పొడిగించబడుతుంది అనీ తెలియజేశారు. అందువలన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు శారీరక యోగాసములతో పాటు ధ్యానం కూడా చేయాలని తెలియజేశారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా వాకింగ్ చేస్తూ, యోగాసనాలు చేస్తూ, ధ్యానము తప్పకుండా చేయాలని తెలియజేశారు. యోగాసనులతోపాటు ప్రతి మనిషి 45 సంవత్సరములు దాటిన తర్వాత , తను తీసుకునే ఆహారపు అలవాటులను మార్చుకోవాలని తెలియజేశారు. 45 సంవత్సరముల తర్వాత మాంసాహారం తక్కువ చేసి శాఖాహారం ఎక్కువగా తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు బాగా తీసుకోవాలని జై.శ్రీనివాసులు చెప్పారు. శాకాహారము తీసుకుంటూ , జీవన శైలిని మార్చుకున్నట్లయితే ప్రతి మనిషి ఎక్కువ కాలం జీవించవచ్చని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ అమృత, స్టాఫ్ నర్స్ వినీత, ఆసుపత్రి హెడ్నర్స్ మరియు స్టాఫ్ అన్వర్, రవికుమార్, గౌస్, ఏఎన్ఎం సుందరి పాల్గొన్నారు.

# మిట్టకోడూర్ ప్రభుత్వ పాఠశాలలో యోగ దినోత్సవం వేడుకలు





**జర్నలిస్ట్ డైరీ, వికారాబాద్ (జూన్ 21):**

అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్టకోడూర్ గ్రామంలో . ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి ఉస్మాన్ అలీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించడం జరిగింది. విద్యార్థులందరికీ ఆరోగ్యం పైన యోగ పైన అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ యోగ చేయాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిరోజు ఉదయం ప్రతి ఒక్కరూ యోగా చేయడం ఆరోగ్యానికి ఎంతో అవసరమని మనిషి దగ్గర ఎంత డబ్బు ఉన్నా, అనారోగ్యం ఏర్పడినప్పుడే ఆరోగ్యం విలువ తెలిసి వస్తుందని మనిషి రుచి కోసం ఏది పడితే అది తినవద్దని, ఆరోగ్యం కోసం మంచి నాణ్యతతో కూడిన పౌష్టికాహారం మాత్రమే తినవలెనని తెలిపారు పాఠశాల ప్రాంగణంలో పాధ్యాయులందరూ యోగా చేస్తూ విద్యార్థులందరికీ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల చేత యోగ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ కృష్ణయ్య , ఎం నర్సింలు , రాజు , కవిత, పంచాయితీ కార్యదర్శి , బాలకిషన్ , అంగన్వాడి టీచర్స్ శ్రీమతి పద్మమ్మ, చంద్రకళ , విద్యార్థుల తల్లిదండ్రులు , పాల్గొన్నారు.



## ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జయశంకర్ సార్ కు నివాళి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
తెలంగాణ తొలి ఉద్యమ స్ఫూర్తి స్వరాష్ట్ర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయ శంకర్ సార్ వర్ధంతి సందర్భంగా షాద్ నగర్ ఎంపీడీవో కార్యాలయం ముందు ఉన్న జయశంకర్ సార్ విగ్రహానికి ఉద్యమ కారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సిద్ధాంత కర్త, తెలంగాణ స్వాప్నికుడు, జీవితాంతం స్వరాష్ట్ర సాధన కోసం తపించి తన జీవితాన్ని తెలంగాణ సాధన కొరకు అంకితం చేసిన మహామనిషి , తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని ఆయన సేవలను కొనయాడారు. జయ శంకర్ సార్ ఆశయ సాధనలో భాగంగా తెలంగాణ ఉద్యమ కారుల కు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ను నెరవేర్చాలి అని వెంకట్ రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు .

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారులు వెంకట్రాం రెడ్డి, ఏ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ల యాదయ్య,జాంగారి రవి, దొడ్డి రవీందర్, శరత్ కృష్ణ,పద్మారం వెంకటేష్ యాదవ్, రవి కుమార్ గౌడ్, రావుఫ్ , అశోక్ రెడ్డి, సురేష్, బీరప్ప, చంద్ర శేఖర్, సలీం, సునీల్ రెడ్డి, మల్లేష్, ఎల్లోజీ, కృష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు

### ఇజ్రాయెల్- ఇరాన్ ఉద్రిక్తతపై స్పందించిన సోనియా గాంధీ..

- **కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు**
- **గాజా, ఇరాన్ విషయంలో భారత్ మౌనం పట్ల అసంతృప్తి**
- **“ఇది గొంతు కోల్పోవడం కాదు... విలువల సర్పణ”**
- **భారత్ చారిత్రక నైతిక స్థైర్యాన్ని కోల్పోయింది**
- **మానవ హక్కుల ఉల్లంఘనలపై మౌనం బాధాకరం: సోనియా**

ఇరాన్ -ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్పందించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని ఆమె ఖండించారు. మోడీ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్, ఇరాన్ విషయంలో భారత్ మౌనం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. “ఇది గొంతు కోల్పోవడం కాదు.. విలువల సర్పణ” అని ఆమె పేర్కొన్నారు. భారత్ చారిత్రక నైతిక స్థైర్యాన్ని కోల్పోయిందని.. మానవ హక్కుల ఉల్లంఘనలపై మౌనం బాధాకరమన్నారు. అంతర్జాతీయ మానవతా బాధ్యతను గుర్తు చేశారు. ఈ మేరకు సోనియా గాంధీ ఓ వ్యాసం రాశారు. దాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పంచుకున్నారు. ఇరాన్ భారతదేశానికి మిత్ర దేశమని, ఇరు దేశాల మధ్య సంబంధాలు ఎల్లప్పుడూ బాగానే ఉన్నాయని సోనియా గాంధీ ఆ వ్యాసంలో పేర్కొన్నారు.

## ప్రభుత్వ స్కూల్స్ లో ఉపాధ్యాయుల నిర్లక్ష్య ధోరణి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
ఒక పక్క ప్రైవేట్ స్కూల్స్ లో ఫీజుల దోపిడీ.. మరో పక్క ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మూత్ర శాలలు కడిగిపిస్తున్నారు. విద్యార్థులకు చదువు అధించాల్సిన ఉపాధ్యాయులు వారి బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్న పరిస్థితిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. షాద్ నగర్ డివిజన్ ఎస్ఎఫ్ఐ కమిటీ సమావేశం సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో వారు పేర్కొంటూ..నేరేళ్ళ పల్లి గ్రామంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు మూత్ర శాలలు శుభ్రం చేయిస్తే,కేశంపేట మండలం పాటిగడ్డలో టీచర్లు మాత్రం మేమేం తక్కువ అని 7 మంది ఉపాధ్యాయులు తమ విధులకు సెలవు పెట్టి మరి వారి యొక్క సొంత అవసరాలకి వెళ్లారనీ ఇలా అయితే విద్యా వ్యవస్థ ఎలా మార్పు వస్తుందని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ బడులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయనీ వీటిలో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల లేమి, నాణ్యమైన విద్యా పద్ధతుల లోపం మరియు నిధుల కొరత ప్రధానమైనవనీ చాలా ప్రభుత్వ బడుల్లో తగిన గదులు, శుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, లైబ్రరీలు మరియు ల్యాబ్‌లు లేకపోవడం ఒక సాధారణ సమస్య. ఇంకా, ఉపాధ్యాయుల శిక్షణ మరియు నియామక ప్రక్రియలో లోపాలు విద్య నాణ్యతను దెబ్బతీస్తున్నాయనీ మరో పక్క విద్యా బుద్ధులు చెప్పాల్సిన గురువులు వారికీ సహకరించడం లేనీ ఎలా అయితే పేద విద్యార్థులు ఎలా చదువుకుంటారని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కార్యదర్శి శివ శంకర్, తరుణ్, వినయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## దస్తావేజు లేఖరుల నూతన అధ్యక్షుడు ఒగ్గు కిషోర్ కు ఘన సన్మానం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
నిన్న జరిగిన దస్తావేజు లేఖరుల ఎన్నికలలో ఘన విజయం సాధించి అధ్యక్ష పదవిని చేపట్టిన ఒగ్గు కిషోర్ ను కంచి అసోసియేట్స్ సీనియర్ న్యాయవాది కంచి రాజ్ గోపాల్ న్యాయవాదులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కంచి అసోసియేట్స్ సీనియర్ న్యాయవాది రాజ గోపాల్, జీవన గమనంలో ఉగ్గు కిషోర్ మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని, శ్రమకు తగ్గిన ఫలితం భగవంతుడు ఎప్పుడూ నిర్ణయిస్తాడని, పని చేసుకుంటూ పోవడమే తన లక్ష్యంగా ఉన్న ఒగ్గు కిషోర్ ఇంకా అనేక లక్ష్యాలను సాధించడంలో సఫలీకృతుడు కావాలని, సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక సుస్థిర స్థానం ఏర్పరచుకోవాలని, అందరి ఆశయాలకు ఆలోచనలకు అనుగుణంగా తన వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలని, కష్టంలో ఉన్న ప్రతి వారికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని, దస్తావేజు లేఖరుల సమస్యలను పరిష్కరించే దిశగా అందరినీ కలుపుకొని పోవాలని ఆకాంక్షించారు. దస్తావేజు లేఖరుల నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఒగ్గు కిషోర్ సన్మానించే కార్యక్రమంలో కంచి అసోసియేట్స్ న్యాయవాదులు లక్ష్మణ్ ప్రశాంత్ నర్సింలు తోపాటు తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైనందుకు ఒగ్గు కిషోర్ కు కంచి అసోసియేట్స్ న్యాయవాదులు అందరూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.





## మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ను పరామర్శించిన ప్రముఖులు

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ను శనివారం ఎక్లాస్ ఖాన్ పేటలోని ఆయన స్వగృహంలో షాద్నగర్ కు చెందిన జర్నలిస్ట్ లు, బిఆర్యెస్ నాయకులు కలుసుకుని పరామర్శించారు. ఈ నేపథ్యంలో యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంజయ్య ను కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్ట్ ఆమనగంటి శివకుమార్, నాయకులు గడ్డం నందకిషోర్, నక్కల వెంకటేష్, ఎన్. మురళీధర్ రెడ్డి, లు ఉన్నారు.

# తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్: రవీందర్ యాదవ్

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త హక్కుల కోసం నిరంతరం కృషిచేసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని బీఆర్ఎస్ యువనాయకుడు వై. రవీందర్ యాదవ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం షాద్ నగర్ మున్సిపాలిటీ న్యూ సిటీ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసే నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను ఎప్పటికీ అప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, తెలంగాణ రాష్ట్ర సాధన వైపు తెలంగాణ ప్రజలను మలిపిన ప్రముఖులు జయశంకర్ సార్ అని అన్నారు. 1952 నుంచి నాన్ ముల్కి, ముల్కీ ఉద్యమానికి తెరలేపి సీమాంధ్ర ప్రాంత నేతల ఆధిపత్యాని వ్యతిరేకించారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతానికి, తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై గళం విప్పి విద్యార్థులను, మేధావులను, ఉద్యోగస్తులను తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించే విధంగా అవగాహన కల్పించారని చెప్పారు. సాగునీళ్ళ, ఉద్యోగాలు, నిధులు వంటి అంశాలలో మనకు జరుగుతున్న అన్యాయాల గురించి క్షుణ్ణంగా తెలియజేసి ఉద్యమం వైపు మళ్లించారని ఉపయోగపడ్డారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ సూచనతో కెసిఆర్ సారథ్యంలో జేఏసీని ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని సాధించుకునే అంతవరకు విశ్రమించకుండా పని చేశారని కొనియాడారు. తెలంగాణ ప్రాంతం ఉన్నంతకాలం ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరును మర్చిపోలేరని, ఆయన మన మధ్యలో భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన పేరు మన మనస్సుల్లో ఉంటుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ లక్ష్మీనరసింహా రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, చెట్ల నరసింహా, నంద కిషోర్, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, ఒగ్గు కిషోర్, గాదె సుధాకర్, గోపాల్, నందిగామ శ్రీనివాస్, గౌస్ జానీ, అందె జంగరాజ్, గోపాల్, భిక్షపతి, అందె మహేశ్వర్, భువనేశ్వర్ రెడ్డి, బిలాల్, రాఘవేందర్, రామచందర్, మహమూద్, ఉమాప్రసాద్, అల్లాడ శేఖర్, గుండు అశోక్, శరత్ కృష్ణ, చెర్క శివ, దొడ్డి రవి, సలీం, అశోక్ రెడ్డి, వెంకటేష్ గుప్తా, ఉమారాణి, రాహూఫ్, సుశాంత్, శ్రీనివాస్, వినోద్, ఈశ్వర్, సందీప్ సింగ్, శీలం శ్రీకాంత్, తుప్పుడు నరసింహా, రాజశేఖర్, పాండు, హనుమంతు, విజయ్, సంతోష్ నాయక్, పిల్లి సాయి, సంజు నాయక్, రఘు, తేజ, శీలం సాయి, జగన్ నాయక్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు యోగా, వ్యాయామం, దినచర్యలో భాగం కావాలి: ఎంపీడీఓ

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి (జూన్ 21):**
నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమంలో పరిగి ఎంపీడీవో కరీం, పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ కరీం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి యోగా , వ్యాయామం, నడక అనేవి దినచర్యలో భాగం కావాలన్నారు. యోగ వలన శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని అన్నారు.యోగా అనేది ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని, దీని మూలాలన్ని భారత్ లోనే ఉన్నాయన్నారు .ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి ఉష, ప్రధానోపాధ్యాయులు నర్సిములు గౌడ్, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అనంతలక్ష్మి, రమాదేవి, సంధ్యారాణి, గ్రామ కార్యదర్శి శివ పాల్గొన్నారు.



## నెల్లూరు జిల్లా ఏఎస్ పేట వద్ద హైవేపై ప్రమాదాల జోన్‌ను పరిశీలించిన మంత్రి ఆనం

- **ఏఎస్ పేట వద్ద ప్రమాదాలపై మంత్రి ఆనం దృష్టి**
- **ఆత్మకూరు సమీపంలో ప్రమాదాల జోన్ పరిశీలించిన మంత్రి ఆనం**
- **ప్రమాదాల కట్టడికి పటిష్ట చర్యలు చేపడతామన్న మంత్రి**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

నెల్లూరు జిల్లా ఆత్మకూరు సమీపంలోని ముంబై జాతీయ రహదారిపై ఏఎస్ పేట క్రాస్ రోడ్డు వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలపై రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టి సారించారు. శనివారం ఆయన అధికారులతో కలిసి ఈ ప్రమాదకర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కృష్ణపట్నం పోర్టు ముంబై జాతీయ రహదారిపై నిత్యం జరుగుతున్న ప్రమాదాల నివారణకు రాష్ట్ర అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గతంతో పోలిస్తే ప్రమాదాలు తగ్గాయని మంత్రి పేర్కొన్నారు. 2024 జూన్ నాటికి ఏడాది కాలంలో 22 ప్రమాదాలు జరిగితే, కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఈ ఏడాది జూన్ నాటికి ఆ సంఖ్య 10కి తగ్గిందని వివరించారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలో 2024లో 68 ప్రమాదాల్లో 37 మంది మరణించగా, ఈ ఏడాది ఇప్పటివరకు 27 ప్రమాదాల్లో 16 మంది మృతి చెందారని తెలిపారు. ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు.
అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నాయకత్వంలో సాధ్యమైందన్నారు.



## రప్పా.. రప్పా..

### నరకడానికి ఆయన ఏమైనా స్టేట్ రౌడీనా..?

- **రప్పా.. రప్పా.. నరకడానికి జగన్ ఏమన్నా స్టేట్ రౌడీనా?..**
- **జగన్ అధికారంలోకి వస్తే సామాన్యులు రోడ్లపై తిరుగుతారా..?..**
- **రప్పా.. రప్పా లాడిస్తాడనే జగన్ ను ప్రజలు ఇంటికి పంపించారు..**


**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలను ఇంకా రప్పా.. రప్పా.. డైలాగ్ వీడడం లేదు.. ప్లకార్డులపై ఎప్పుడైతే రప్పా.. రప్పా.. డైలాగ్ రాసి ప్రదర్శించారు.. అప్పటి నుంచి ఈ డైలాగ్ రాజకీయ నేతల నోట వింటూనే ఉన్నాం.. మాజీ సీఎం వైఎస్ జగన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఇలా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు కూడా ఈ డైలాగ్ చుట్టూనే కామెంట్లు చేస్తున్నారు.. తాజాగా, వైఎస్ జగన్‌పై మండిపడ్డారు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. రప్పా.. రప్పా.. నరకడానికి వైఎస్ జగన్ ఏమన్నా స్టేట్ రౌడీనా? అని ప్రశ్నించారు.. ఇప్పుడు ఇలా ప్రవర్తిస్తున్న వైఎస్ జగన్ అధికారంలోకి వస్తే సామాన్యులు రోడ్లపై తిరుగుతారా..? అని ఆవేదన వ్యక్తం చేశారు.. జగన్ రప్పా.. రప్పా లాడిస్తాడనే ప్రజలు ఇంటికి పంపించారని ఎద్దేవా చేశారు.. తండ్రి (వైఎస్ రాజశేఖర్‌రెడ్డి) హయంలో లక్ష కోట్లు దోచుకున్న వ్యక్తి వైఎస్ జగన్ అని ఆరోపించారు..
రప్పా.. రప్పా అంటున్నారు కదా..? దమ్ముంటే ఎవరినైనా టచ్ చేసి చూడండి.. అంటూ సవాల్ చేశారు బొలిశెట్టి శ్రీనివాస్.. మరోవైపు, మేం రప్పా.. రప్పా ఆడించాలంటే 24 గంటలు చాలు.. కానీ మేం రౌడీలం కాదు అని పేర్కొన్నారు.. ఇక, ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందన్నారు ప్రభుత్వ విప్, జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.

## జగన్‌కు వస్తున్న జనాదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారు.. అందుకే..!

- **సీఎం చంద్రబాబుపై ఎంపీ మిథున్ రెడ్డి ఫైర్..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేకపోతున్నారంటూ ఫైర్ అయ్యారు వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి.. చిత్తూరులో మాజీ ఎమ్మెల్య చింతల రామచంద్రారెడ్డి సతీమణిని పరామర్శించడానికి కుటుంబ సమేతంగా వెళ్లిన మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నాయుడు మనస్థత్వంతోనే మామిడి రైతులకు ఈ దుస్థితి వచ్చిందన్నారు.. ఓ పక్క జిల్లా కలెక్టర్ నాలుగు రూపాయలు సబ్సిడీ ఇస్తాం, పల్ప్ ఫ్యాక్టరీలు ఎనిమిది రూపాయలు ఇవ్వాలని ఆదేశాలిచ్చినా.. ఫ్యాక్టరీ యజమానులు మాటవినడం లేదన్నారు. రైతులు మూడు రూపాయలకు ఇస్తామన్నా ఫ్యాక్టరీలు నిరాకరిస్తున్నారని విమర్శించారు.. రాష్ట్రంలో రైతు అన్నవాడు ఎవ్వరూ సంతోషంగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు పెద్దిరెడ్డి.. ఇక, ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైఎస్ జగన్ ప్రశ్నిస్తే ఆయనపై వ్యక్తిగత దూషణకు దిగుతున్నారని అన్నారని మండిపడ్డారు.. వైఎస్ జగన్ ప్రజల్లోకి వస్తే.. వారి నుంచి వస్తున్న జనాదరణను చూసి సీఎం చంద్రబాబు నాయుడు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి..

# యోగాంధ్ర సూపర్ హిట్..

## హిస్టరీ క్రియేట్ చేయగలిగాం..

- **విశాఖ యోగా డేలో 3 లక్షల మందికి పైగా యోగా సాధనలో పాల్గొనడంపై హర్షం**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర2025' కార్యక్రమం సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం వేదికగా నిర్వహించిన ఈ బృహత్ యోగా ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. విశాఖ కలెక్టరేట్ లో యోగాడే గ్రాండ్ సక్సస్ పై సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులుతో సమీక్షించారు. విశాఖతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఇంటర్నేషనల్ యోగా డే జరిగిన తీరుపై చర్చించారు. పలు ప్రపంచ రికార్డుల సాధనపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉద్యోగులు, అధికారులకు సిఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ప్రజల సహకారం, భాగస్వామ్యం, అన్ని విభాగాల సమన్వయంతో యోగా డే గ్రాండ్ సక్సెస్ అయ్యిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతో బాధ్యత తీసుకుని పనిచేసిన తీరుకు చంద్రబాబు అభినందనలు తెలియజేశారు. అర్థరాత్రి 2 గంటల నుంచే ప్రజలు తరలి రావడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు కొందరు అధికారులు. విశాఖ యోగా డేలో 3 లక్షల మందికి పైగా యోగా సాధనలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. పాల్గొన్నవారి లెక్కింపులో క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం తిరుగులేని ఫలితాన్ని ఇచ్చిందన్నారు మంత్రులు. యోగాంధ్ర సూపర్ హిట్ అయ్యింది.. హిస్టరీ క్రియేట్ చేయగలిగామని సీఎం తెలిపారు.

తెల్లవారుజామున 3లక్షల 03 వేల మందికి పైగా క్యూ ఆర్ కోడ్ తో వెన్యూ కి వచ్చారు.. రెండు గిన్నిస్ రికార్డులు నమోదు చేశాం.. కోటి 80లక్షల మందికి యోగా సర్టిఫికెట్ల కోసం రిజిస్ట్రేషన్ అయ్యింది.. 10ఏళ్ల ప్రధాని కృషి ఫలించింది.. 12 లక్షల లోకేష్‌నలో 10కోట్ల మంది భాగస్వామ్యులయ్యారు.. యోగాడే ను విశాఖ లో నిర్వ హించమని ప్రధాని అడిగారు.. నెల రోజుల షెడ్యూల్ కాలంలో అధికార యంత్రాంగం విశేషంగా పనిచేశారు.. జీరో ఇన్సిడెంట్స్ తో ఇంత పెద్ద ఈవెంట్ జరగడం గొప్ప విషయమని సీఎం

## మైలవరంలో కన్న బిడ్డలను హత్య చేసిన కేసులో కీలక పరిణామం.. ఆ కారణంతోనే

- **మైలవరంలో కన్న బిడ్డలను హత్య చేసిన కేసులో కీలక పరిణామం**
- **తండ్రి రవిశంకర్ ఆచూకీ పోలీసులు గుర్తించారు**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఓ తండ్రి ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. మృతులు హిరణ్య (9), లీలసాయి (7)గా గుర్తించారు. అయితే, రెండు నెలల కిందట పిల్లలను తన భర్త రవిశంకర్ వద్ద వదిలి వెళ్లిందట తల్లి చంద్రిక.. దీంతో, తీవ్ర మనస్తాపానికి గురై.. ఆత్మహత్య చేసుకుందామని భావించి ఉంటాడని.. తన పిల్లలను ఎవరు పోషిస్తారనే వారిని కూడా హత్య చేసి ఉంటాడని అంతా భావించారు.

ఇక, ఆ ఇంట్లో ఓ సూసైడ్ లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.. "నా చావుకు ఎవరు బాధ్యులు కాదని, జీవితంలో ఏమి సాధించలేదని.. అందుకే నా పిల్లలను చంపి నేను చనిపోతున్నానని" లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు రవి శంకర్. తాజాగా కన్న బిడ్డలను హత్య చేసిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బిడ్డల్ని హత్య చేసి తాను సూసైడ్ చేసుకుంటున్నట్టు లేఖ రాసిన కనిపించకుండా పోయిన తండ్రి రవిశంకర్ ఆచూకీ పోలీసులు గుర్తించారు.

భార్య చంద్రికపై అనుమానంతో ఇద్దరు పిల్లల్ని ఈ నెల 8న హత్య చేసి రవిశంకర్ పరారయ్యాడు. కృష్ణానదిలో దూకి సూసైడ్ చేసుకుంటున్నట్టు డ్రామా ఆడాడు. ఇన్నిరోజులు కావస్తున్నా రవిశంకర్ బాడీ దొరక్క పోవటంతో బ్రతికి ఉన్నాడనే కోణంలో పోలీసులు విచారించారు. ఈ క్రమంలో విశాఖలో రవిశంకర్ ఉన్నట్టు గుర్తించి మైలవరం తీసుకు వచ్చారు పోలీసులు. భార్యపై అనుమానంతో ఇద్దరు పిల్లలని హత్య చేసినట్టు రవిశంకర్ ఒప్పుకున్నట్టు సమాచారం. రవిశంకర్ ను ఇవాళ అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## జైల్లో ఉన్న చెవిరెడ్డికి అస్వస్థత... ఆసుపత్రికి తరలింపు

- **ఛాతీలో నొప్పితో విజయవాడ ఆసుపత్రికి తరలింపు**
- **ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు**
- **మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డి**



వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు ఉదయం ఛాతీలో నొప్పి రావడంతో జైలు అధికారులు వెంటనే స్పందించారు. ప్రాథమికంగా జైలులోని వైద్యులతో పరీక్షలు చేయించిన అనంతరం, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
ప్రభుత్వాసుపత్రిలోని ఫిజియోథెరపీ విభాగంలో వైద్యులు చెవిరెడ్డికి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు స్పష్టం చేశారు. ఈరోజు సాయంత్రం వరకు ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉంటారని, అనంతరం తగిన మందులు ఇచ్చి డిశ్చార్జ్ చేస్తారని తెలిపారు. ఈ సాయంత్రానికి చెవిరెడ్డిని తిరిగి జిల్లా జైలుకు తరలించే అవకాశాలున్నాయి.
కాగా, ఈ కేసుకు సంబంధించి చెవిరెడ్డిని ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ సిట్ అధికారులు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అదే సమయంలో, చెవిరెడ్డి తరపు న్యాయవాదులు బెయిల్ మంజూరు చేయాలని, జైలు భోజనం పడటం లేదని ఇంటి నుంచి భోజనం తెప్పించుకునేందుకు అనుమతించాలని కోర్టును అభ్యర్థిస్తూ వేర్వేరు పిటిషన్లు సమర్పించారు. ఈ పిటిషన్లపై ఈనెల 23న ఏసీబీ కోర్టులో విచారణ జరగనుంది.

## ఇజ్రాయెల్‌లోని భారతీయులకు జరిమానా ప్రచారంపై స్పందించిన భారత్

- **ఇది అవాస్తవమని స్పష్టం చేసిన భారత రాయబార కార్యాలయం**
- **సంక్షేమ పథకాలు, అత్యవసర సాయం కోసమే రిజిస్ట్రేషన్ అని వెల్లడి**

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం:**

ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు అక్కడి భారత రాయబార కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో జరిమానాలు లేదా జైలు శిక్షలు విధిస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటువంటి నిరాధారమైన ప్రచారాలను నమ్మవద్దని ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం తెలియజేసింది.

కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ఒక సమాచారం ఇజ్రాయెల్‌లోని భారత పౌరుల్లో ఆందోళన కలిగిస్తోంది. దీని ప్రకారం, ప్రతీ భారతీయుడు ఎంబసీలో రిజిస్టర్ చేసుకుని, వెంటనే స్వదేశానికి తిరిగి వచ్చేయాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని ఆ సందేశంలో పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం దీనిపై స్పందించింది. ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేసింది.

రాయబార కార్యాలయం వద్ద భారత పౌరుల పేర్ల నమోదు అనేది పూర్తిగా వారి సంక్షేమం కోసమేనని అధికారులు వివరించారు. సంక్షోభ పరిస్థితులు తలెత్తినప్పుడు వారిని సులభంగా సంప్రదించడానికి, భారత ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, ఇతర సౌకర్యాలు వారికి అందేలా చూడటానికి ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉపయోగపడుతుందని తెలిపారు. అంతే తప్ప, ఇది తప్పనిసరి కాదని, దీనికి ఎలాంటి జరిమానాలు గానీ, శిక్షలు గానీ ఉండవని స్పష్టం చేశారు. కచ్చితమైన సమాచారం కోసం ఎంబసీ విడుదల చేసే అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

# పాకిస్థాన్ గొంతు ఎండాల్సిందే

- **సింధూ నదీ జలాల ఒప్పందం పునరుద్ధరణ ఉండదని అమిత్ షా స్పష్టం**
- **పాకిస్థాన్ ఒప్పంద నిబంధనలు ఉల్లంఘించిందని ఆరోపణ**
- **పాక్‌కు వెళ్లే నీటిని కెనాల్ ద్వారా రాజస్థాన్‌కు మళ్లిస్తామని వెల్లడి**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునఃప్రారంభించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ ఒప్పందంలోని నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని, ఇన్నాళ్లూ అన్యాయంగా నీటిని పొందిందని, ఇకపై ఆ దేశం నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు.

ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ, "అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేము, కానీ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారతదేశానికి ఉంది. మేం అదే చేశాం" అని అన్నారు. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే అంశం ఉందని, అయితే ఒకసారి దాన్ని ఉల్లంఘించిన తర్వాత రక్షించడానికి ఏమీ మిగలదని ఆయన స్పష్టం చేశారు.

భారతదేశానికి హక్కుగా దక్కిన నీటిని సంపూర్ణంగా వినియోగించుకుంటామని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కెనాల్ నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే జలాలను రాజస్థాన్‌కు మళ్లిస్తామని ఆయన వివరించారు. "ఇంతకాలం పాకిస్థాన్ అన్యాయంగా నీటిని పొందింది. ఇకపై ఆ దేశం గొంతు ఎండిపోవాల్సిందే" అంటూ అమిత్ షా వ్యాఖ్యానించారు.

**పాకిస్థాన్‌పై తీవ్ర ప్రభావం**

1960వ దశకంలో భారత్, పాకిస్థాన్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. అయితే, పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఘటన తర్వాత ఈ ఒప్పందం అమలును భారత్ నిలిపివేసింది. ఈ నిర్ణయం పాకిస్థాన్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆ దేశ నీటి సరఫరా వ్యవస్థ ప్రధానంగా సింధూ జలాలపైనే ఆధారపడి ఉంది. వ్యవసాయానికి వినియోగించే నీటిలో దాదాపు 80 శాతం ఈ ఒప్పందం ద్వారానే లభిస్తోంది. పాకిస్థాన్ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 25 శాతం ఈ నదీ జలాల కారణంగానే వస్తుందంటే, భారత తాజా నిర్ణయం భవిష్యత్తులో ఆ దేశంపై ఎంతటి ప్రభావాన్ని చూపనుందో అర్థం చేసుకోవచ్చు.

# తెనాలిలో ఘనంగా యోగా దినోత్సవం..

- యోగా డే సందర్భంగా తెనాలిలో మెగా యోగా కార్యక్రమం
- పాల్గొన్న ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- ఆరోగ్యానికి యోగా మంచి మార్గమని మంత్రి ఉద్బోధ
- యోగా గురువులను, వయోవృద్ధులను సన్మానించిన మంత్రి



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం మెగా యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై, స్వయంగా యోగాసనాలు వేసి అందరిలో స్ఫూర్తి నింపారు.

తెనాలిలో జరిగిన ఈ మెగా యోగా కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ యోగా మాస్టర్ల సూచనల మేరకు వివిధ ఆసనాలను అభ్యసించారు. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, యువతీయువకులు ఉదయం 6:30 గంటలకే కార్యక్రమస్థలికి చేరుకుని సుమారు గంటపాటు యోగాసనాలు వేశారు.

ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ... "ఆరోగ్యంగా జీవించడానికి, ఔషధాల అవసరం లేకుండా ఉండటానికి యోగా ఒక అద్భుతమైన మార్గం. యోగా మన భారతీయ సంస్కృతిలో అంతర్భాగం. ఇది శారీరక దృఢత్వాన్ని, మానసిక ప్రశాంతతను అందిస్తుంది" అని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా యోగా దినోత్సవం విజయవంతమైందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. "సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ప్రజల్లో ఆరోగ్యం పట్ల చైతన్యం తీసుకురావడానికి గత నెల రోజులుగా 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాం. ప్రజల విశేష స్పందనతో ఇది విజయవంతమైంది" అని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన ప్రధాన కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారని, భారతదేశం నుంచి యోగా ప్రపంచానికి పరిచయం కావడం గర్వకారణమని అన్నారని మంత్రి గుర్తుచేశారు.

తెనాలిలో జరిగిన కార్యక్రమంలో 70 ఏళ్లు పైబడిన వృద్ధులు కూడా ఎంతో ఉత్సాహంగా యోగాసనాలు వేయడం, ఇతరులకు ఆదర్శంగా నిలవడం పట్ల మంత్రి నాదెండ్ల మనోహర్ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం యోగా ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఆ తర్వాత శిక్షణ ఇచ్చిన యోగా గురువులను, కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులను మంత్రి ఘనంగా సన్మానించారు.



## 'యోగాంధ్ర' విజయవంతానికి చంద్రబాబు, లోకేశ్ తీవ్రంగా శ్రమించారు: మంత్రి అనగాని

- యోగాంధ్ర ఘన విజయంపై మంత్రి అనగాని సత్యప్రసాద్ హర్షం
- కార్యక్రమానికి విశేష స్పందన: ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ధన్యవాదాలు
- విశాఖలో యోగాంధ్ర అరుదైన రికార్డు నమోదు
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి ప్రశంసనీయం అన్న అనగాని
- రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్లకు పైగా ప్రజల భాగస్వామ్యం, చారిత్రాత్మకం

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

రాష్ట్రవ్యాప్తంగా 'యోగాంధ్ర' కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. యోగాంధ్రను ఇంతటి విజయవంతం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అందించిన సహకారం, వారి కృషి ఎనలేనిదని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకున్న రాష్ట్ర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విశాఖపట్నం వేదికగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ఒక అరుదైన రికార్డును నెలకొల్పిందని మంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంతో యావత్ ప్రపంచం ఒక్కసారిగా ఆంధ్రప్రదేశ్ వైపు దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు.

కేవలం విశాఖపట్నంలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు ఉత్సాహంగా యోగాసనాల్లో పాలుపంచుకున్నారని మంత్రి తెలిపారు. దాదాపు రెండు కోట్లకు పైగా ప్రజలు యోగాంధ్రలో పాల్గొని ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించారని ఆయన వివరించారు. ఈ అపూర్వ స్పందన యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తోందని అనగాని సత్యప్రసాద్ అన్నారు.



## సీసీటీవీ ఫుటేజీని విడుదల చేయలేమన్న ఈసీ..

- మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సీసీ ఫుటేజీలను బహిర్గతం చేయాలని విపక్షాలు డిమాండ్..
- అలా చేయడం చట్టవిరుద్ధం.. ఓటర్ల గోపత్యకు భంగం కలిగించినట్లు అవుతుంది: ఎన్నికల సంఘం..
- సీసీ ఫుటేజీ ఇవ్వడం కుదరదని తెలిపి ఈసీ.. తీవ్రంగా మండిపడిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ..


**జర్నలిస్ట్ డైరీ, జాతీయం:**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని రిలీజ్ చేయాని విపక్షాలు గతకొంత కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎలక్షన్ కమిషన్ ఇవాళ (జూన్ 21న) కీలక ప్రకటన చేసింది. ఓటింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్‌కు సంబంధించిన సీసీ ఫుటేజ్‌లను బహిరంగ పేర్చలేమని తేల్చి చెప్పింది.

అలాంటి వీడియో కంటెంట్‌ను షేర్ చేయడం వల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతుందని పేర్కొంది. అంతేగాక, ప్రజాస్వామ్య ప్రక్రియకు సైతం ప్రమాదం వాటిల్లుతుందని తెలిపింది. సీసీ ఫుటేజీని విడుదల చేయాలనే డిమాండ్లు పారదర్శకతను ప్రోత్సహించేలా ఉన్నప్పటికీ, అవి ప్రతికూలమైవని, చట్టబద్ధంగా కుదరదని చెప్పుకొచ్చింది ఈసీ.
అయితే, సీసీ ఫుటేజీని బహిర్గతం చేయడమంటే.. 1950, 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంతో పాటు సుప్రీంకోర్టు సూచనలను ఉల్లంఘించడమే అవుతుందని ఎన్నికల సంఘం చెప్పుకొచ్చింది. ఇక, ఈసీ ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. సమాధానాలు చెప్పాల్సిన వాళ్లే ఆధారాలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో రిగ్గింగ్ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని తెలిపాం.. ఓటరు లిస్టు? దానిని మెషిన్‌రీడబుల్ ఫార్మాట్‌లో అందించరు.. సీసీ ఫుటేజ్ దాచడానికి చట్టంలో మార్పులు చేశారు.. ఎన్నికల ఫోటోలు, వీడియోలు ఏడాది పాటు ఉంచే బదులు వాటిని కేవలం 45 రోజుల్లోనే తొలగిస్తారని తెలిపారు. దీని ద్వారా మ్యాచ్ ఫిక్సింగ్ అయినట్టు క్లియర్ గా తెలుస్తుందని విమర్శలు గుప్పించారు.

## యోగాను ప్రపంచ వ్యాప్తం చేసిన దార్శనికుడు ప్రధాని మోడీ

- యోగాను ప్రపంచ వ్యాప్తం చేసిన దార్శనికుడు ప్రధాని మోడీ
- మోడీ సంకల్ప సాధకుడు



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం. ఈ సందర్భంగా విశాఖలో యోగాంధ్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు సహా ప్రముఖులు హాజరయ్యారు. ఆర్కేబీచ్ నుంచి భీమిలి వరకు కంపార్ట్‌మెంట్స్ ఏర్పాటు చేశారు. యోగాంధ్ర వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది.

ఈ కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాను ప్రపంచ వ్యాప్తం చేసిన దార్శనికుడు ప్రధాని మోడీ అని తెలిపారు. మోడీ సంకల్ప సాధకుడు.. యోగా భారతీయులకు దక్కిన గౌరవమని అన్నారు. యోగాకు 175 దేశాల మద్దతు కూడగట్టిన శక్తి మోడీ అని కొనియాడారు. వన్ ఎర్త్.. వన్ హెల్త్ నినాదం మన విధానం కావాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

## ఆయేషా మీరా కేసులో ముగిసిన సీబీఐ దర్యాప్తు.. హైకోర్టు కీలక ఆదేశాలు..

- ఆయేషా మీరా హత్య కేసులో ముగిసిన సీబీఐ దర్యాప్తు..
- తుది నివేదికను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించిన సీబీఐ..




**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముగిసింది.. దీంతో, తుది నివేదికను సీల్డ్ కవర్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించారు సీబీఐ అధికారులు.. ఇక, ఈ కేసు విచారణ సందర్భంగా.. సీబీఐ కోర్టులోనూ ఆయేషా మీరా కేసుకు సంబంధించిన నివేదిక కాపీని అందించాలని.. సీబీఐ అధికారులను ఆదేశించింది హైకోర్టు.. మరోవైపు, ఈ కేసులో తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా వేశారు హైకోర్టు న్యాయమూర్తి..

విజయవాడలోని ఓ హాస్టల్‌లో 17 ఏళ్ల ఆయేషా మీరా అనే ఫార్మసీ విద్యార్థినిపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన ఘటన.. అప్పట్లో తీవ్ర కలకలం సృష్టించింది.. 2007 డిసెంబర్27వ తేదీన జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది.. హాస్టల్‌లోని బాత్‌రూమ్‌లో కత్తిపోట్లతో ఆయేషా మీరా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే, 2018లో ఈ కేసును పునర్విచారణ చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది.. తొలుత సిట్‌కి ఆ బాధ్యతలు అప్పగించిన హైకోర్టు.. సిట్ దర్యాప్తులో పురోగతి లేదని, ఈ కేసులో సీబీఐ విచారణకు ఆదేశించిది.. దీంతో, విచారణ పూర్తి నివేదికను సీల్డ్ కవర్‌లో ఈ రోజు హైకోర్టుకు అందజేశారు సీబీఐ అధికారులు..

### 175 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయి..

## యోగాపై ఇకో సిస్టంని డెవలప్ చేస్తున్నాం

- యోగా ప్రపంచాన్ని ఏకం చేసింది
- 175 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయి
- యోగా గ్లోబలైజ్ కావడం సామాన్యమైన విషయం కాదు
- యోగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవన శైలిని మార్చింది
- అంతరిక్షంలో కూడా యోగా చేసిన ఘనత మనదే. :ప్రధాని మోడీ



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

విశాఖపట్నం సాక్షిగా అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా ప్రారంభమైంది. సముద్రతీరాన లక్షలాది మంది ప్రజలు చేరి యోగాసనాలు చేస్తూ ఈ వేడుకను ఆహ్లాదంగా జరుపుకుంటున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అనేక మంది ప్రముఖులు ఈ విశిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. యోగా ప్రపంచాన్ని ఏకం చేసిందన్నారు. 175 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని, యోగా గ్లోబలైజ్ కావడం సామాన్యమైన విషయం కాదని ఆయన వ్యాఖ్యానించారు. యోగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవన శైలిని మార్చిందని, అంతరిక్షంలో కూడా యోగా చేసిన ఘనత మనదే అని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు.
అంతేకాకుండా.. యోగాకు సరిహద్దుల్లేవు.. వయసుతో పనిలేదని, ప్రకృతి, ప్రగతి సంగమం.. విశాఖపట్టణమన్నారు. యోగాంధ్ర ఈవెంట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఏపీ సర్కారుకు అభినందనలు తెలిపారు ప్రధాని మోడీ. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి లోకేష్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రజల భాగస్వామ్యానికి ఇదొక స్ఫూర్తిగా నిలిచిందని, వికసిత్ భారత్ ఆలోచనలకు ఇది రూపం అని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు.

యోగా మనల్ని నడిపిస్తుందని, యోగా మనల్ని మేల్కొలుపుతుందన్నారు. యోగా వ్యక్తిగత క్రమశిక్షణకు మారుపేరని, ప్రపంచ గమనాన్ని మార్చింది యోగా అని ఆయన పేర్కొన్నారు. వన్‌ఎర్త్.. ఎన్ హెల్త్ థీమ్‌తో ఈసారి యోగా దినోత్సవాన్ని నిర్వహించామని, యోగా ప్రక్రియతో చికిత్స చేసే విధానాన్ని ఢిల్లీ ఎయిమ్స్ అభివృద్ధి చేస్తోందన్నారు. యోగాను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఇకో సిస్టంని డెవలప్ చేస్తున్నామని ప్రధాని మోడీ తెలిపారు. యోగా గురించి మన్ కీ బాత్‌లో కూడా విస్తృతంగా చర్చించానని, రోజూ మనం తినే ఆహారంలో 10 శాతం నూనె తగ్గించాలన్నారు మోడీ. సంతులిత జీవన శైలిని అలవాటు చేసుకోవాలని ప్రజలకు ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.



## చంద్రబాబు పాలనపై సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర విమర్శలు

- రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శ
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపణ
- చంద్రబాబు తప్పులను జగన్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్య

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**


ముఖ్యమంత్రిగా చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జగన్ రైతుల సమస్యలపై తక్షణం స్పందించి, గిట్టుబాటు ధర కల్పించేవారని గుర్తుచేశారు.
రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని, వీధుల్లోనే గంజాయి అమ్ముతున్నారని సజ్జల ఆరోపించారు. వైసీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తూ పోలీసులు వేధిస్తున్నారని, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తన తప్పులను ఇతరులపై, ముఖ్యంగా జగన్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, వీటిపై ప్రజల పక్షాన వైసీపీ నిరంతరం ప్రశ్నిస్తూనే, పోరాడుతూనే ఉంటుందని సజ్జల స్పష్టం చేశారు. కేవలం మీడియా హైప్‌తోనే చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

## బనకచర్ల ప్రాజెక్టుపై హర్షకుమార్ సంచలన ఆరోపణలు..

- బనకచర్లపై జీవీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు..
- జేబులు నింపుకోవడానికే 81 వేల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు..
- పోలవరం పూర్తి చేయకుండా.. బనకచర్ల ప్రాజెక్టు ఎందుకు..

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తోంది.. తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుండా.. ఏపీ ఎలా ఈ ప్రాజెక్టు నిర్మిస్తుందని టీజీ సర్కార్ ప్రశ్నిస్తోంది.. ఈ వ్యవహారాన్ని కేంద్రం దృష్టికి కూడా తీసుకెళ్లారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అయితే, అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ బనకచర్లపై సంచలన ఆరోపణలు చేశారు.. జేబులు నింపుకోవడానికే 81 వేల కోట్లతో పోలవరం బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్నారని విమర్శించారు హర్షకుమార్. ముందు పోలవరం పూర్తి చేయకుండా.. బనకచర్ల ప్రాజెక్టు ఎందుకు అంటూ ప్రశ్నించారు. మరోవైపు, రాజధాని అమరావతిలో 90 శాతం భూములు ఖాళీగా పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. రాజమండ్రిలో మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ విధానాలు సరిగా లేవని విమర్శించారు. యోగా డే పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేశారని, ప్రధాని నరేంద్ర మోడీ మెప్పు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తాపత్రయ పడుతున్నారని ఆరోపించారు అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్.





## కుబేర నాకెంతో స్పెషల్..

శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో నాగార్జున, ధనుష్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కుబేర'. ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా ఈ సినిమాపై నేచురల్ బ్యూటీ సాయిపల్లవి స్పందించింది. 'కుబేర' సినిమా తనకు ఎంతో స్పెషల్ అని చెప్పింది. ఛాలెంజింగ్ పాత్రలు ఎంచుకోవడం, అద్భుతంగా నటించడం ధనుష్ సర్ వల్లే సాధ్యమవుతుంది. "శేఖర్ డైరెక్షన్‌లో నాగార్జున సర్ కిల్లర్ లాంటి పాత్రలో కనిపించడం మాకు కన్నుల పండగ్గా ఉంటుంది. ప్రియమైన రష్మిక.. శేఖర్ గారు తన సినిమాల్లో హీరోయిన్లకు శక్తివంతమైన పాత్రలు ఇస్తారు. కుబేరలో నీ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అలాగే నీ విజయాల పరంపరలో ఈ మూవీ కూడా చేరిపోతుంది. దేవి శ్రీ ప్రసాద్ గారు.. మీరు మరోసారి మ్యాజిక్ చేయడం ఖాయం! చైతన్య, సూరి, అజయ్, స్వరూప్.. మీరంతా రక్తం ధారపోసి కష్టపడ్డారు. అందుకు ప్రతిఫలం, గుర్తింపు తప్పకుండా వస్తుంది. నిర్మాత సునీల్ గొప్ప కథల్ని ఎంచుకుని అందిస్తున్నందుకు దివంగత నారాయణ్‌దాస్ గారు పై నుంచి ఎంతో గర్విస్తుంటారు. శేఖర్‌గారిలాంటి స్వచ్ఛమైన హృదయం కలవారే ఇలాంటి సినిమాలు తీయగలరు. మీరు ఒక తరాన్నంతటినీ ప్రభావితం చేస్తున్నారు. అందులో నేనూ ఉన్నాను. నా గురువుగారు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని మనసారా కోరుకుంటున్నాను." అని పల్లవి ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.



## యోగా డే.. తరలివచ్చిన సినీతారలు

తమిళ స్టార్ హీరో విజయ్ ఇళయతళపతి హీరోగా వస్తున్న తాజాగా సినిమా 'జననాయగన్'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ మూవీ ఫస్ట్ గ్లింప్స్ డేట్ రిలీజ్ డేట్‌ను మూవీ టీమ్ ఫిక్స్ చేసింది. జూన్ 22న మధ్యాహ్నం 12 గంటలకు ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ మూవీని హెచ్. వినోద్ డైరెక్ట్ చేస్తున్నారు. పూజాహెగ్డే హీరోయిన్ గా చేస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్ సంస్థ భారీ బడ్జెట్ తో దీన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన విజయ్ నుంచి వస్తున్న చివరి మూవీ ఇది. అందుకే మూవీని గ్రాండ్ గా తీస్తున్నారంట. విజయ్ పొలిటికల్ ఎంట్రీని దృష్టిలో పెట్టుకుని రాజకీయ అంశాలతో మూవీని తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. ఈ సినిమాను తమిళ రాజకీయాల్లో కీలకంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. విజయ్ పొలిటికల్ కెరీర్ కు ఇది ప్లస్ అవుతుందని ఆయన ఫ్యాన్స్ అంటున్నారు. విజయ్ కు తెలుగునాట కూడా భారీ ఫ్యాన్ బేస్ ఉంది. అందుకే మూవీ గురించి అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఫస్ట్ గ్లింప్స్ తో మూవీపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మూవీని 2026 జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు.



## ప్రభాస్ భుజాలపైనే 'కన్నప్ప' భారం

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిన సినిమా 'కన్నప్ప'. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. భారీ కాస్ట్‌తో రూపొందిన ఈ సినిమా భారమంతా ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ భుజాల పైనే ఉంది. అందుకే ట్రైలర్‌లో ప్రభాస్ షాట్స్ ఎక్కువగా పెట్టినట్లు అనిపిస్తుంది. ఇందులో దాదాపు అరగంట పాటు ప్రభాస్ పాత్ర ఉంటుందనీ, తన కెరీర్‌లో తప్పకుండా గుర్తుండపోయే సినిమా అవుతుందని పదే పదే చెబుతున్నాడు. శనివారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరగనుంది. దీనికి ప్రభాస్ వస్తాడా? రాడా అనే టాపిక్ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. సోషల్ మీడియాలో కూడా కన్నప్ప టీమ్‌ను ట్యాగ్ చేస్తూ 'ప్రభాస్ ప్రమోషన్స్‌కి వస్తున్నాడా? లేదా అది చెప్పండి' అని అభిమానులు నిలదీస్తున్నారు. అయితే ప్రభాస్ కూడా ఈ ఈవెంట్‌కు వస్తాడనే అంతా భావిస్తున్నారు. ఇప్పటికే మోహన్‌బాబు ప్రభాస్‌కి స్వయంగా ఫోన్ చేసి ఈవెంట్‌కు ఆహ్వానించారని తెలిసింది. మోహన్‌బాబు కోసం ఆయన ఈ సినిమా చేశారని ఇటీవల మోహన్‌బాబు చెప్పిన సంగతి తెలిసిందే! మరోపక్క ప్రభాస్ 'రాజాసాబ్ చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ మధ్యన ఆయన ఈవెంట్స్‌లో పెద్దగా కనిపించడం లేదు. ఇటీవల జరిగిన 'రాజాసాబ్' టీజర్ లాంచ్‌లోనూ ఆయన కనిపించలేదు. అలాంటిది కన్నప్పకు వస్తాడా అనేది ప్రశ్నగా మారింది. ఒకవేళ ప్రభాస్ ఈ వేడుకకు వస్తే మాత్రం సినిమాకు బూస్ట్ ఇచ్చినట్లు అవుతుంది. సినిమాకు మరింత క్రేజ్ పెరుగుతుంది.



## థియేటర్ లో ఏడ్చేసిన ధనుష్..

తమిళ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్ టాప్ హీరో నాగార్జున నటించిన సినిమా కుబేర. ఈ సినిమా శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలయింది. ఈ సినిమాకు తొలి షో నుంచే అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమాను ధనుష్.. చెన్నైలోని ఓ థియేటర్‌లో తన కుమారిడితో కలిసి చూశాడు. ఈ సందర్భంగా స్క్రీన్‌పై తన పాత్రను చూసుకున్న ధనుష్ భావోద్వేగానికి లోనయ్యాడు. పాన్ ఇండియా సినిమాగా వచ్చిన ఈ మూవీ.. ఫస్ట్ షో నుంచే అన్ని ఏరియాల్లో మంచి టాక్ సంపాదించుకుంది. ధనుష్ లాంటి స్టార్ హీరో ఒక బిచ్చగాడిగా కనిపించడం అందరికీ ఆశ్చర్యంగా అనిపించింది. పైగా బిచ్చగాడి గెటప్ లో ఆయన ఒదిగిపోయిన తీరు ప్రశంసలు కురిపిస్తోంది. చాలా రోజుల తర్వాత నాగార్జునకు సరైన పాత్ర పడింది. శేఖర్ కమ్ముల నుంచి మరో మాస్టర్ పీస్ వచ్చిందని కామెంట్లు వస్తున్నాయి. ఇందులో ఎవరు హీరో అంటే చెప్పలేమని.. కథే హీరో అని చూసిన ప్రేక్షకులు చెబుతున్న మాట. తెలుగుతో పాటు తమిళంలో మంచి రివ్యూలు వస్తుండటంతో మూవీ టీమ్ సంతోషంగా ఉంది. ధనుష్ ఇప్పటికే ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించాడు. ఇప్పుడు ఈ పాత్రతో మరో మైల్ స్టోన్ అందుకున్నాడనే చెప్పాలి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465